# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 16-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:218 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

ఫయిటరు లోహ ఖగములను
స్వయముగ నిర్మింపగోరి సర్కారు ధృతిన్
ఎయిరో స్పేసు పరిశ్రమ
నయతమ్ముగ పుట్టపర్తి యందున నిలిపెన్ !!

(ఫయిటర్ జెట్ విమానాలను తయారుచేసే ఎయిరో స్పేస్ సంస్థ ను పుట్టపర్తి లో చంద్రబాబు సమక్షంలో రాజ్ నాథ్ సింగ్ ప్రారంభించారు. ఇది ఆంధ్రప్రదేశ్ కు ఆదాయాన్ని ఉద్యోగ అవకాశాలను అందిస్తుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ఎలెక్షన్ కమిషనర్ల
ఎంపిక ప్రక్రియ
కేంద్రానికి అనుకూలం
కట్టబెట్టే దుష్క్రియ.
ఏకపక్షమయే తంతు
ఎత్తి చూపే కోర్టు నేడు
స్వతంత్ర విధానాన్ని
చంపివేసే చీడ కీడు.



-వేల్పుల నారాయణ
9440433475

## అందుకే వాళ్లకు వణుకు పుడుతుంది: టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, మే15: కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు దొంగ ఓట్లతో గెలిచారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. అందుకే వాళ్లకు వణుకుపుడుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డితో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. రాష్ట్రంలో జరగనున్న సర్ ప్రక్రియపై సుదర్శన్ రెడ్డితో వారు చర్చించారు.

అనంతరం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. 14 రాష్ట్రాల్లో సర్ ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. దుర్మార్గంగా ఓట్ల ప్రక్రియ జరిగిందంటూ మండిపడ్డారు. అందుకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలే నిదర్శమన్నారు. దేశంలో 8.2 కోట్ల ఓట్లు జోడిస్తే.. 5.90 లక్షల ఓట్లు తొలగించారని విమర్శించారు. బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలు మారి అధికారంలోకి రావాల్సిన పార్టీలు ఓటమి పాలయ్యాయన్నారు. బెంగాల్‌లో 90 లక్షల ఓట్లు తొలగించి.. 60 లక్షలు కలిపారని చెప్పారు.

తెలంగాణలో వచ్చే రెండు ఏళ్లలో ఎన్నికలు లేవన్నారు. ఈ నేపథ్యంలో సర్ ప్రక్రియ ఏడాది జరపాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని తాము కోరామని టీపీసీసీ చీఫ్ తెలిపారు. పేదల ఓట్లు తొలగిస్తే వారు సరైన డాక్యుమెంట్లు ఇవ్వలేరన్నారు. ఈ నేపథ్యంలో అందుకు 3 నెలలు సమయం ఇవ్వాలని చెప్పారు. మూడు సార్లు బీఎల్‌వోలు.. వారి ఇంటికి వెళ్లి పరిశీలన చేయాల్సి ఉందని తెలిపారు.

కొన్ని చోట్ల బయట దేశస్థులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా SIR జరగాల్సి ఉందని ఆకాంక్షించారు. బీజేపీకి పడని ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

ఎవరి ఓట్లు వారే కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. జూన్ 25 నుంచి తెలంగాణలో SIR ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. జూలై 24 దాకా ఓటర్ల వివరాల సేకరణ ఉంటుందన్నారు. అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల జాబితా ప్రచురణ చేస్తారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

## జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసు.. ప్రధాన నిందితుల అరెస్ట్

హైదరాబాద్, మే 15: జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు.

ఆ బైక్‌ను యాప్రాల్లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి.. నేపాలీ ముఠా దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## భర్తతో కలిసి ప్రియుడ్ని హత్య చేసిన మహిళ.. మృతదేహాన్ని డ్రమ్‌లో కుక్కి పారవేత

ముంబై, మే 15: ఒక మహిళ తన భర్త, సోదరుడు, మరొకరితో కలిసి ప్రియుడ్ని హత్య చేసింది. ఆ తర్వాత మృతదేహాన్ని డ్రమ్‌లో కుక్కి కాలువలో పడేశారు. ఆ వ్యక్తి మిస్సింగ్ ఫిర్యాదుపై దర్యాప్తు చేసిన పోలీసులు ఈ విషయం తెలుసుకుని షాక్ అయ్యారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ముంబ్రాకు చెందిన అర్బాజ్ మక్సూద్ అలీ ఖాన్, ఏప్రిల్ 3న పని నిమిత్తం దాదర్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఫలితం లేకపోవంతో అర్బాజ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాగా, మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అర్బాజ్ ఫోన్ కాల్స్, లొకేషన్ డేటాను పరిశీలించారు. చివరిసారి వసాయి ప్రాంతంలో అతడు ఉన్నట్లు తెలుసుకున్నారు. అర్బాజ్ ప్రియురాలు మెహజబీన్ షేక్ ఫోన్ లొకేషన్ కూడా ఆ ప్రాంతంలో ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెపై అనుమానించిన పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.మరోవైపు తొలుత బుకాయించిన మెహజబీన్, ఆ తర్వాత నిజాన్ని అంగీకరించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అర్బాజ్ నుంచి డబ్బు వసూలు కోసం ప్రయత్నించారని, ఫలితం లేకపోవడంతో అతడ్ని హత్య చేసినట్లు చెప్పారు. మెహజబీన్, ఆమె భర్త హసన్, సోదరుడు తారిక్ షేక్, అతడి ఫ్రెండ్ కలిసి అర్బాజ్‌ను కట్టేసి కొట్టారని, ఆ తర్వాత అతడ్ని హత్య చేశారని వెల్లడించారు.అనంతరం నిందితులు అర్బాజ్ మృతదేహాన్ని గ్రీన్ డ్రమ్‌లో కుక్కి ముంబ్రా ప్రాంతంలోని కాలువలో పాడేశారని పోలీస్ అధికారి తెలిపారు.

## అబుదాబి చేరుకున్న ప్రధాని మోదీ.. యూఏఈతో కీలక అంశాలపై ఒప్పందాలు



న్యూఢిల్లీ, మే 15:యూఏఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శుక్రవారం అబుదాబి చేరుకున్నారు. మోదీకి యూఏఈ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఘన స్వాగతం పలికారు. యూఏఈ చేరుకున్న అనంతరం ప్రధాని మోదీ.. అక్కడి అత్యున్నత గౌరవమైన గార్డ్ ఆఫ్ ఆనర్ అందుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా యూఏఈ, ఇండియా మధ్య కీలక అంశాలపై పలు ఒప్పందాలు వ్యూహాత్మక భాగస్వామ్యం, ఎనర్జీ, రక్షణ, పెట్టుబడులు వంటి అంశాల్ని కీలకంగా చర్చించనున్నారు. తాజా సమాచారం ప్రకారం వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యంపై, ద్వైపాక్షిక, వ్యూహాత్మక రక్షణ సహకారంపై యూఏఈ, ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. అలాగే, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, ఎల్పీజీ సరఫరాపై కూడా ఎంఓయూ కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఇండియాకు చమురు సరఫరా పెరగనుంది. ఇరు దేశాలకు నౌకా రవాణ చాలా కీలకం.

అందుకే రెండు దేశాల మధ్య నౌకల మరమ్మతుల కోసం వాడినార్‌లో ఒక క్లస్టర్ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. ఆర్బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్ సహా ఇండియాలోని నిర్మాణ రంగంలో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడులకు కూడా ఒప్పందం కుదిరింది.

మరోవైపు ఇటీవల యూఏఈపై ఇరాన్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. పలు మిస్సైళ్లతో యూఏఈలోని చమురు క్షేత్రాలపై దాడులు చేసింది. ఈ దాడుల్ని భారత్ ఖండించింది. తాజాగా ప్రధాని మోదీ కూడా యూఏఈపై దాడుల్ని ఖండించారు. యూఏఈని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం ప్రధాని మోదీ విదేశాల్లో పర్యటనకు వెళ్తున్నారు. ముందుగా యూఏఈలో పర్యటిస్తున్నారు. ఆ తర్వాత నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలో పర్యటిస్తారు.

## తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకనామీ లక్ష్యం: శ్రీధర్‌బాబు




సంగారెడ్డి, మే 15: తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానిం చారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) కొండాపూర్ మండలం తొగరపల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో TGIIC చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్-IIకి శ్రీకారం చుట్టారు.

### 1500 మంది మహిళలకు ఉపాధి..

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగరపలిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి TGIIC చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తు న్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.


### పటాన్‌చెరులో మొదటగా పరిశ్రమలు ఏర్పడ్డాయి: దామోదర రాజనర్సింహ

ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

### సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలు తీసుకువచ్చాం: జగ్గారెడ్డి

మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు BHEL, BDL, ODF లాంటి కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

## ఏఎంసీఏ ప్రాజెక్టు రాయలసీమ అభివృద్ధిలో కీలక మైలురాయి: సీఎం చంద్రబాబు




పుట్టపర్తి, మే 15: రాయలసీమ లక్ష్యాలను చేరడమే కాదని.. లక్ష్యాలను ఛేదిస్తోందంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రక్షణ రంగంలో భారత్ బలోపేతానికి ఏపీ ప్రధాన కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చేపడుతున్న ఏఎంసీఏ ప్రోగ్రామ్ ఫెసిలిటీ కేంద్రం రాయలసీమ అభివృద్ధిలో మరో కీలక మైలురాయి అని అభివర్ణించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి ఈరోజు ఏఎంసీఏ ప్రాజెక్టు శంకుస్థాపనకు హాజరయ్యానని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో స్వదేశీ రక్షణ సాంకేతికతల్లో భారత్ వేగంగా ముందుకు వెళ్తోందని ఉద్ఘాటించారు. స్టెల్త్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఏవియానిక్స్, సమగ్ర యుద్ధ విమాన సాంకేతికతలో ఏఎంసీఏ ప్రోగ్రామ్ కీలకమని వ్యాఖ్యానించారు.

ఈరోజు రాయలసీమలో కీలక రక్షణ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో 9 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. వ్యూహాత్మక తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## ఇంధనం పొదుపు చర్యలపై సుప్రీం కీలక నిర్ణయం.. వారంలో రెండుసార్లు విచారణ

న్యూఢిల్లీ, మే 15: ప్రస్తుత పెట్రోలియం సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంధన పొదుపు చర్యలపై నిర్దిష్టమైన రోజుల్లో వర్చువల్ తరహాలో కోర్టు ప్రొసీడింగ్స్ జరపనున్నట్టు ప్రకటించింది.అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం ప్రకారం, ప్రతి సోమ వారం, శుక్రవారాల్లో సుప్రీం కోర్టులో వర్చువల్ విచారణ జరుగనుంది. తక్కిన మూడు పనిదినాల్లో హైబ్రిడ్ మోడల్ (ముఖాముఖీ తరహా)లో విచారణ చేపడుతుంది.ప్రస్తుత ఇంధన సంక్షోభ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సీజేఐ సూర్యకాంత్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకూ కోర్టు ప్రొసీండింగ్స్‌ను ఫిజికల్ అప్పియరెన్స్, వర్చువల్ తరహాలో సుప్రీంకోర్టు నిర్వహిస్తోంది. ప్రధాన నరేంద్ర మోదీ ఇటీవల జాతీ ప్రయోజనాల దృష్ట్యా వర్క్ ఫ్రం హోం చర్యలు, ఇంధన పొదుపు చర్యలకు సంబంధించిన తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా నిర్ణయం తీసుకుంది.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు.. కేంద్రంపై టీపీసీసీ చీఫ్ తీవ్ర ఆగ్రహం..

హైదరాబాద్, మే 15:ఎట్రోల్, డీజిల్ ధరల పెంపుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను మళ్లీ పెంచిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఆగ్రహించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నాయని, దేశంలో మాత్రం పెట్రోల్ రేట్లను పెంచి కేంద్రం దోచుకుంటోందని మహేశ్ గౌడ్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వ చర్యలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందన్నారు. చివరకు సామాన్యుడు తీవ్రంగా నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు.

ప్రజా సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్: రాజ్‌నాథ్

పుట్టపర్తి, మే 15:యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ (ఖీజీతీనిజీబిష్త్ర రాతినిణష్త్ర) వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ రోజు(శుక్రవారం) పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి - కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు.

ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం ఆరుగురు మృతి



కర్ణాటక, మే 15: కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కొప్పల తాలూకా మునీరాబాద్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీకొనడంతో అది వంతెనపై నుంచి కిందపడింది. ఈ దుర్ఘటనలో చిన్నారి సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది గాయపడ్డారు.

సండూరు, కూడ్లిగి తాలూకాలకు చెందిన 16మంది ట్రాక్టర్‌లో హులిగమ్మ దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. లారీ ఢీకొట్టిన ధాటికి ట్రాక్టర్ అదుపుతప్పి వంతెనపై నుంచి కిందపడిపోయింది.

ప్రమాదంలో చిన్నారి సహా ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## మే 26న కేరళకు నైరుతీ రాక.. రుతుపవనాలపై ఐఎండీ కీలక ప్రకటన

న్యూ ఢిల్లీ, మే 15:భారతీయ వాతావరణ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. నైరుతీ రుతుపవనాల మే 26వ తేదీ వరకు కేరళలో ప్రవేశించనున్నట్లు ఐడీఎం తెలిపింది. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ ఒకటో తేదీ వరకు నైరుతీ రుతుపవనాలు కేరళ చేరుకుంటాయి. ఆ రుతుపవనాలు కేరళ చేరుకోవడంతో భారత్‌లో వర్షాకాలం మొదలువుతుంది.

ఆ తర్వాత ఆ రుతుపవనాలు ఉత్తర భారత దేశం దిశగా పయనిస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ఇండియాలో వర్షాకాలం ఉంటుంది. అయితే గత ఏడాది మే 24వ తేదీన కేరళకు నైరుతీ రుతుపవనాలు చేరుకున్నాయి. ఇక ఈ ఏడాది మాత్రం మే 26వ తేదీన ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. ఒక నాలుగు రోజులు ముందే లేదా తర్వాత నైరుతీ ఆగమనం ఉంటుందని భావిస్తున్నారు.

నైరుతీ రుతుపవనాల రాక కోసం దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల్లోలో అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ వారం మొత్తం పశ్చిమ భారతం, మధ్య భారతంలో తీవ్రమైన వేడి వాతావరణం ఉంటుందని ఐఎండీ చెప్పింది.

# ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్న 'కాంతి' !

## (16 మే "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" సందర్భంగా)

విశ్వంలో కాంతి ఒక ప్రధాన భాగమే కాకుండా అత్యంత మౌళిక అంశంగా మారింది. అత్యంత సూక్ష్మ కణాల ధర్మాలను వర్ణించే క్వాంటం సైన్స్‌కు మూలాధారం కాంతి మాత్రమే. వేడి చేసిన వస్తువుల నుండి కాంతి కణాల లేదా ఫోటాన్ల ధర్మాల వరకు కాంతి శాస్త్రం వర్ణించబడుతుంది. ఫోటాన్స్ అంటే కాంతి సూక్ష్మ కణాలని అర్థం చేసుకోవాలి. కాంతికి పర్యాయపదంగా ఫోటాన్స్ నిలుస్తున్నాయి. కాంతి లేని భూగోళం శీతలం, బంజరు నేలల మయం. కాంతి ఎక్కడ ఉంటుందో అక్కడ జీవుల ఉనికి కనిపిస్తుంది. మానవాళి మనుగడకు కాంతితో అవిభాజ్య సంబంధం నెలకొని ఉన్నది. వైజ్ఞానిక శాస్త్ర అభివృద్ధి అంటే కాంతి దృగ్విషయాల శోధనలు మాత్రమే. కాంతి మాంద్యంగానే ప్రపంచ సూక్ష్మ విషయాలు అవగతం అవుతున్నాయి. 16 మే 1960 రోజున తొలిసారి బౌతికశాస్త్రజ్ఞుడైన ఇంజనీరు 'థియోడోర్ మైమాన్' కృషితో లేజర్ సర్జరీ జరిగింది. కాంతి పరిశోధనలతో ప్రత్యామ్నాయ శక్తి వనరులు, వైద్య రంగంలో ఒకచ్చితత్వంతో రోగ నిర్ధారణలు, చికిత్స మార్గాలు, హై-స్పీడ్ ఇంటర్నెట్ లాంటి అనేక ఆవిష్కరణలు నేటి ఆధునిక పౌర సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్నాయి.

### కాంతి వైజ్ఞానికశాస్త్ర అనంత ప్రయోజనాలు:

నేడు కాంతి ఆధార వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీల పాత్ర అనన్య సామాన్యమైపోయింది. ఫోటోనిక్స్ ద్వారా నేడు ప్రపంచమంతటా అంతర్జాలం/కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సమన్వయ పరచబడింది. ఆప్టికల్ టెక్నాలజీలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు సుస్థిర వ్యవసాయానికి బాటలు వేస్తున్నాయి. కాంతి వల్లనే భూమి కుగ్రామం అయిపోయింది. వాతావరణ మార్పుల అధ్యయనాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం లాంటివి సుసాధ్యం అవుతున్నాయి. సమ్మిళిత అభివృద్ధి, ఆహార భద్రత, ఆకలికి సమాధానం కూడా కాంతి శాస్త్రం ఇవ్వగలుగుతున్నది. అగ్ర-ఫోటానిక్స్ వేదికగా సాగు పద్ధతుల్లో విప్లవాత్మక సకారాత్మక మార్పులు వస్తున్నాయి. శక్తిని ఆదా చేయడానికి ఎల్ఈడీ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. టెలీ-కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు కాంతి పునాదులు వేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది కంటి చూపు దోషాలను సవరించడానికి కాంతి-ఆధారిత భౌతిక శాస్త్రం దోహదపడుతున్నది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమాటిక్స్ - స్టెమ్ సమన్వయంతో సమ్మిళిత వైజ్ఞానికశాస్త్ర అభివృద్ధికి రాచ బాటలు పడుతున్నాయి. లింగ సమానకడక్వ సాధనకు మహిళలు, యువతులను కాంతి ఆధారిత పరిశోధనల వైపు మరల్చాలి. నేడు దాదాపు 28 శాతం మహిళలు పరిశోధనారంగాల్లో పని చేయడం జరుగుతోంది. శుద్ధ సురక్షిత తాగు నీటి లభ్యతకు ఫోటోనిక్స్ టెక్నాలజీలు ఉపయోగపడుతున్నాయి.

### అంతర్జాతీయ కాంతి దినోత్సవం-2026 ఇతివృత్తం:

ప్రపంచ శాంతి, సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తున్న కాంతి ప్రక్రియలను, కాంచి ప్రాధాన్యాలను వివరించడానికి, మరింత ప్రయోజనకరంగా మార్చడానికి ప్రతి ఏట 16 మే రోజున "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ లైఫ్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ కాంతి దినోత్సవం" ఇతివృత్తంగా "ఉజ్వల సుస్థిర భవిష్యత్తుకు కాంతి (లైట్ ఫర్ ఏ సస్టేనబుల్ ఫ్యూచర్)" అనబడే అంశాన్ని తీసుకొని నిత్య జీవితంలో కాంతి ప్రాధాన్యాలను వివరించడంతో జరుగుతుంది. కాంతి అద్భుత ధర్మాలను లేదా కాంతి-ఆధారిత టెక్నాలజీలను సాధారణ మానవాళికి వివరించడం, కాంతి అంశంలో మరింత లోతైన పరిశోధనలను ప్రోత్సహించడం, కాంతితో కళలు/సంస్కృతి సంబంధాలను వర్ణించడం, కాంతి అనువర్తనాలను చర్చించడం, సుస్థిరాభివృద్ధిలో కాంతి సాంకేతికతను వాడుకోవడం లాంటి అంశాలతో పాటు శక్తిని సమర్థవంత వినియోగాలు, శక్తి నష్టాల నివారణ, కాంతి కాలుష్య కట్టడి లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. పునరుత్పాదక శక్తి వనరులు, మానవాళి కనీస అవసరాలు, వాతావరణ మార్పులు, కృత్రిమ ఉపగ్రహాలు లాంటివి కాంతి ఆధారంగానే జరుగుతున్నాయి.

### అంతర్జాతీయ కాంతి దినోత్సవ కార్యక్రమాలు:

2015 ఏడాదిని అంతర్జాతీయ కాంతి సంవత్సరంగా పాటించడం సత్ఫలితాలను ఇవ్వడంతో 2018 నుంచి యునెస్కో అంచర్జాతీయ కాంతి దినోత్సవాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. వైద్య ఆరోగ్య రంగాలు, ఇంటర్నెట్-కమ్యూనికేషన్ వ్యవస్థలు, సుస్థిర శక్తి వనరుల వాడకం, విద్యుతో పాటు ఆవిష్కరణలు లాంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సుసాధ్యం కావడానికి కాంతి-ఆధారిత ఆధునిక పరిజ్ఞానాలు దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ కాంతి దినోత్సవ వేదికగా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఉపన్యాసాలు, వెబినార్లు, సదలేజర్-ఆప్టిక్స్ నమూనాల ప్రదర్శనలు, ఆర్ట్ - ఫోటోగ్రఫీ రంగాల్లో పోటీలు, ప్లానిటోరియం సందర్శనలు లాంటివి ఏర్పాటు చేయవచ్చు. ఈ వేదికలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, ఫోటోగ్రాఫర్లు, ఆర్టిస్టులు, ఫోటోనిక్స్ టెక్నోక్రాట్లు పాల్గొని రేపటి తరానికి మార్గదర్శనం చేయాలి. కాంతిలో దాగిన విశ్వ రహస్యాలను బట్టబయలు చేయాలి, మానవాళి సరళ జీవన విధానాలకు బంగారు బాటలు వేయాలి. కాంతి ఆవిష్కరణలు కమ్యూనికేషన్, ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయం లాంటి అనేక రంగాల్లో సకారాత్మక మార్పులకు పునాదులు వేయాలి. కాంతి వాడకంతో మన ముఖాల్లో నవ్వుల వెలుగులు ప్రసరించాలి.



-మధుపాళీ
9949700037

# 'వలస కార్మికుల హక్కుల పరిరక్షణ: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల సమష్టి బాధ్యత' అంశంపై ఎన్‌హెచ్ఆర్‌సీ కీలక సభ్యుల సమావేశం

న్యూఢిల్లీ, మే 15:'వలస కార్మికుల హక్కుల పరిరక్షణ: ప్రభుత్వం, ప్రైవేటు రంగాల ఉమ్మడి బాధ్యత' అంశంపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ) న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో కీలక సభ్యుల సమావేశాన్ని నిర్వహించింది. దీనికి కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ వీ రామసుబ్రమణియన్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర కార్మికులతో పోలిస్తే వలస కార్మికులు అత్యధికంగా సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వారిలో అత్యధిక మంది అసంఘటిత రంగానికి చెందినవారు కావడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. భాషా పరమైన అడ్డంకులు, నిరంతర వలసలు, స్థిరమైన నివాసం లేకపోవడం వంటి కారణాల వల్ల వారు తమ హక్కులను సంఘటితంగా కాపాడుకోలేకపోతున్నారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం గతంలో ఉన్న బలమైన యూనియన్ల సంప్రదాయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యుడు జస్టిస్ (డాక్టర్) విద్యుత్ రంజన్ సారంగి, సెక్రటరీ జనరల్ శ్రీ భరత్ లాల్, డీజీ (విచారణ విభాగం) శ్రీమతి అనుపమ నీలేకర్ చంద్ర, రిజిస్ట్రార్ (న్యాయ విభాగం) శ్రీ జోగిందర్ సింగ్, జాయింట్ సెక్రటరీలు శ్రీ సమీర్ కుమార్, శ్రీమతి సైడింగ్‌పుయి ఛక్‌చువాక్ తోపాటు భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ రంగాల నిపుణులు, వివిధ ఐక్యరాజ్య సమితి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వలస కార్మికుల గుర్తింపు కోసం 1979లో వచ్చిన చట్టాన్ని, 240 రోజుల నిరంతర పని తర్వాత రక్షణ కల్పించే పారిశ్రామిక వివాదాల చట్టం నిబంధనలను జస్టిస్ రామసుబ్రమణియన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ చట్టాల్లో ఉన్న లొసుగులను యజమానులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని తెలిపారు. కార్మికుల పని పూర్తయ్యే సమయం దగ్గర పడగానే యజమానులు కావాలనే పనిలో విరామం ఇచ్చి, వారు ఆ అర్హతను సాధించకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో 1979 నుంచే కార్మికుల రక్షణ కోసం బలమైన చట్టాలు ఉన్నప్పటికీ, వాటి క్షేత్రస్థాయి అమలు మాత్రం ఆందోళనకరంగానే ఉందని అన్నారు. ప్రభుత్వాలకు తగిన సలహాలు, సూచనలు అందించడంలో జాతీయ మానవ హక్కుల సంఘం, సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అందరికీ తెలిసినవేనని, ఇప్పుడు జరగబోయే వివిధ పక్షాల చర్చల ద్వారా ఆచరణాత్మక పరిష్కారాలు లభిస్తాయని కమిషన్ ఆశిస్తోందని పేర్కొన్నారు. ఈ చర్చల ఆధారంగా రూపొందించే సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు కోసం పంపిస్తామని ఆయన వెల్లడించారు.

వలస కార్మికుల విషయంలో కేవలం నిబంధనలను పాటించడమే కాకుండా, వారి హక్కులకు ప్రాధాన్యతనిచ్చే సంస్కృతి రావాలని జస్టిస్ రామసుబ్రమణియన్ స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య సమన్వయం, ఎక్కడికైనా తరలించగలిగే సామాజిక భద్రత, కార్మిక చట్టాల పటిష్ట అమలు వంటి వ్యవస్థాగత సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం, హోటల్, వ్యాపార, నిర్మాణ రంగ కార్మికులుగా పనిచేస్తున్న వలసదారులపై తక్షణమే దృష్టి సారించాలని సూచించారు. కార్మికులకు మెరుగైన పని వాతావరణాన్ని కల్పించేందుకు భాషా ప్రాతిపదికన ఏర్పడిన కార్మిక సంఘాల సభ్యులను సమన్వయ మండలిలో భాగస్వామ్యం చేయాలని ప్రతిపాదించారు.

వలస కార్మికులకు సరైన గౌరవం గానీ, వేతనాలు గానీ అందడం లేదని ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యుడు జస్టిస్ (డాక్టర్) విద్యుత్ రంజన్ సారంగి ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల వారు తమ ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వచ్చిన ఉద్దేశమే దెబ్బతింటోందని అన్నారు. కార్మికులు ఆత్మగౌరవంతో జీవించడానికి తగిన వేతనం, నివాస సదుపాయం, వైద్య సేవలు, వారి పిల్లలకు విద్యా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వీటితో పాటు కార్మిక కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన డేటాబేస్‌ను రూపొందించాలని, తద్వారా వారికి కూడా ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూడాలని ఆయన సూచించారు.

అంతకుముందు వలసలపై ఒక నివేదికను ప్రస్తావిస్తూ... ప్రపంచవ్యాప్తంగా వలస కార్మికులు అన్ని స్థాయిల్లోనూ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నారని జాతీయ మానవ హక్కుల సంఘం సెక్రటరీ జనరల్ శ్రీ భరత్ లాల్ కొనియాడారు. దేశ జనాభాలో దాదాపు 28.9 శాతం మంది గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లే కార్మికులే ఉన్నారని, వీరు ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ 19 సంక్షోభ సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న తీవ్రమైన ఇబ్బందులను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యంగా అవుట్‌సోర్సింగ్ కార్మికుల దోపిడీపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. వారిలో చాలామందికి కనీస వేతనాలు కూడా అందడం లేదని తెలిపారు. కాంట్రాక్టర్లు పేమెంట్ యాప్‌ల ద్వారా కార్మికుల జీతాలను భారీగా తగ్గిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. వలస కార్మికుల పట్ల సమాజానికి మరింత సామాజిక స్పృహ, బాధ్యత అవసరమని చెప్పారు.

కార్మికుల అభివృద్ధి కోసం చేసే పెట్టుబడులు, సంక్షేమ చర్యలు వారి పనితీరును గణనీయంగా పెంచుతాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వలస కార్మికులపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ చేసిన ఒక అధ్యయనాన్ని ఉదహరించారు. సంక్షేమ చర్యల వల్ల కర్మాగార కార్మికుల పని సామర్థ్యం 1.38 రెట్లు పెరిగి, వారి కుటుంబ సంక్షేమం, విద్య, పిల్లల భవిష్యత్తు అవకాశాలు మెరుగుపడ్డాయని ఆ అధ్యయనం పేర్కొందని తెలిపారు. సమాజంలో ఎదురయ్యే వివక్ష, అన్యాయం వంటివి కొన్నిసార్లు హింసకు దారితీసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. కొత్త కార్మిక చట్టాలు, డిజిటల్ పాలనా వ్యవస్థల మద్దతుతో కార్మికులకు సరైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించడం సామూహిక బాధ్యత అని స్పష్టం చేశారు. కోవిడ్ 19 సమయంలో జాతీయ మానవ హక్కుల సంఘం చేపట్టిన కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. 'ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు' వంటి పథకాలను అభినందిస్తూనే.. చట్టాలకు, వాటి క్షేత్రస్థాయి అమలుకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రాల మధ్య సమన్వయం పెరగాలని, సామాజిక భద్రత పథకాలు ఎక్కడికైనా వర్తించేలా ఉండాలని, కార్మికుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నిబంధనల అమలు ధోరణి నుంచి హక్కుల ఆధారిత విధానం వైపు మార్పు రావాలని పిలుపునిచ్చారు.

మూడు సాంకేతిక సమావేశాల వివరాలను ఎన్‌హెచ్ఆర్‌సీ సంయుక్త కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ వెల్లడించారు. అవి 'చట్టపరమైన, సంస్థాగత విధానాలు: రక్షణ, అమలులో ఉన్న లోపాలు', 'దేశంలో వలస కార్మికుల హక్కుల పరిరక్షణలో వ్యాపార సంస్థల పాత్ర', 'వలస కార్మికుల రక్షణ, సంక్షేమం కోసం ఆచరణాత్మక చర్యలు-బహుళ పక్షాల భాగస్వామ్యం'. దేశ ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, సరుకు రవాణా, నిర్మాణ పనులు, రోజువారీ జీవితంలో వలస కార్మికులు అత్యంత కీలకమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో గతంలో జరిగిన కార్మిక నిరసనల పరిణామాలను ఆయన గుర్తు చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో వలస కార్మికులు తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్ల నగరాల్లో కార్మికుల కొరత ఏర్పడి, ప్రజా సేవలపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు.

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ విమల్ భట్టర్ మాట్లాడుతూ.. స్టాక్ మార్కెట్‌లో నమోదైన కంపెనీలు తమ పర్యావరణ, సామాజిక, పాలనా (ఈఎస్‌జీ) పనితీరును వెల్లడించే వ్యాపార బాధ్యత, స్థిరత్వ నివేదిక (బీఆర్ఎస్ఆర్) గురించి వివరించారు. దీని ద్వారా కంపెనీలు తమ వద్ద పనిచేసే వలస, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమ గణాంకాలను వెల్లడిస్తాయని తెలిపారు. అయితే అధిక శాతం వలస కార్మికులు ఎంఎస్ఎంఈ, అసంఘటిత రంగాల్లోనే పనిచేస్తున్నారని, దీనివల్ల వారు నిబంధనల పరిధిలోకి రావడం లేదని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీమతి అనుజ బావత్ మాట్లాడుతూ.. వలస కార్మికుల సమస్యలను కేవలం వారి వ్యక్తిగత కోణంలోనే కాకుండా, కుటుంబం, వ్యవస్థ రూపంలో చూడాలని సూచించారు. పీఎం విశ్వకర్మ, పీఎంఈజీపీ, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వంటి పథకాల ద్వారా స్థానికంగానే ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని, తద్వారా దుర్భర వలసలను తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు.

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శ్రీ దీపాంకర్ గుహ మాట్లాడుతూ.. వలస కార్మికుల సంక్షేమానికి ఈ-శ్రమ్ వేదిక బలమైన పునాది వంటిదని పేర్కొన్నారు. ఈ వేదికలో ఉన్న సమాచారాన్ని వివిధ ప్రభుత్వ పథకాలతో అనుసంధానించినప్పుడే కార్మికులకు నిజమైన ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీ కేసీ మీనా మాట్లాడుతూ.. కంపెనీల రిపోర్టింగ్ విధానాలు, నివేదికల వ్యవస్థల గురించి వివరించారు. స్టాక్ మార్కెట్‌లో నమోదైన కంపెనీలకు సంబంధించి కొన్ని రిపోర్టింగ్ బాధ్యతలు స్వచ్ఛందంగా లేదా మారుతూ ఉంటాయని, అలాగే చట్టపరమైన నిబంధనలు కూడా సంస్థను బట్టి మారుతాయని పేర్కొన్నారు.

వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలంటే మెరుగైన డేటా వ్యవస్థలు ఉండాలని ప్రాక్సిస్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పార్టిసిపేటరీ ప్రాక్టిసెస్ సీఈఓ శ్రీ టామ్ థామస్ తెలిపారు. ముఖ్యంగా ఈ-శ్రమ్ వంటి వేదికలను బలోపేతం చేసి, ఇతర డేటాబేస్‌లతో అనుసంధానించాలని సూచించారు. సమాచారం ఒక వ్యవస్థ నుంచి మరొక వ్యవస్థకు సజావుగా చేరినప్పుడే సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఉన్న కార్మికులకు సరిగ్గా అందుతాయని ఆయన పేర్కొన్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్‌లోని సెంటర్ ఫర్ మైగ్రేషన్, మొబిలిటీ అండ్ డయాస్పోరా స్టడీస్‌కు చెందిన పరిశోధన సహాయకులు డాక్టర్ కిష్లయ్ నిర్మాణ రంగ కార్మికుల గురించి ప్రస్తావించారు. ఉప-కాంట్రాక్టు పద్ధతుల్లో ఉన్న లోపాలు, కార్మికుల వద్ద సరైన పత్రాలు లేకపోవడం, సంక్షేమ పథకాల నుంచి మినహాయింపుకు గురవ్వడం వంటి అంశాలను ఎత్తిచూపారు. వీరికి తక్కువ ధరకే గృహ వసతి కల్పించాలని, న్యాయంగా కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ వలసల నిర్వహణ సంస్థ (ఐఓఎం) అధిపతి శ్రీ సంజయ్ అవస్థీ మాట్లాడుతూ.. వ్యాపారాలు, మానవ హక్కులపై ఐక్యరాజ్యసమితి మార్గదర్శకాలను పాటించాలని కోరారు. ముఖ్యంగా నైతిక నియామక ప్రక్రియ ఉండాలని, కార్మికుల నుంచి ఎటువంటి నియామక రుసుము వసూలు చేయకూడదని పేర్కొన్నారు. ఉప-కాంట్రాక్టుల వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచాలని, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు.

వ్యాపార, మానవ హక్కుల నిపుణురాలు, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ ఇండియా) ప్రతినిధి శ్రీమతి నుస్రత్ మాట్లాడుతూ.. వలస కార్మికుల పట్ల కార్పొరేట్ బాధ్యతను మరింత స్పష్టంగా, రంగాల వారీగా నిర్వచించాలని పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన వ్యాపార ప్రవర్తనపై తాజా జాతీయ మార్గదర్శకాలను, వ్యాపారం, మానవ హక్కులపై పటిష్టమైన విధాన సమన్వయం అవసరమని సూచించారు. కేవలం వలసదారులకే కాకుండా కార్మికులందరికీ హక్కుల ఆధారిత విధానం అవసరమని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) వలసదారుల ప్రాథమిక సూత్రాలు, హక్కుల నిపుణుడు ఇన్సాఫ్ నిజాం తెలిపారు. పాలన, అమలు వ్యవస్థలను మెరుగుపరుస్తూనే, నిర్మాణాత్మక, సంస్థాగత అడ్డంకులను పరిష్కరించడం, కార్మిక చట్టాలను రక్షించాల్సిన ఆవశ్యకతను వివరించారు. వలస కార్మికుల వేతన నిర్మాణంలో మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరాన్ని వరల్డ్ బెంచ్‌మార్కింగ్ అలయన్స్ ఆసియా పాలసీ సారథి శ్రీ నమిత్ అగర్వాల్ ప్రస్తావించారు.

# ముఖ్యమంత్రి మానస పుత్రిక రైతు బజారు

## -కృష్ణా నగర్ రైతు బజారుకు శంకుస్థాపన
## -మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్



గుంటూరు, మే 15: గుంటూరు నగరంలోని కృష్ణా నగర్ లో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రైతు బజార్ భవనానికి కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మానస పుత్రిక రైతు బజారు అన్నారు. రూ. 4 కోట్లు స్థలం విలువ కాగా, రూ. 2 కోట్లతో భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. 9 నెలలలో భవన నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. 30 డ్వాక్రా స్టాల్ లు, 60 రైతు స్టాల్ లు, 10 దుకాణాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. రైతు బజారు నిర్మాణం పక్కాగా ఉండాలని, పార్కింగ్ వ్యవస్థ నిర్దిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు బజారు నిర్వహణలో ఎటువంటి అలసత్వం లేకుండా చూడాలని, చుట్టుప్రక్కల నివాసాలకు ఎటువంటి అసౌకర్యం ఉండరాదని స్పష్టం చేశారు.

శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజా మాట్లాడుతూ అందరికీ అనుకూలమైన ప్రదేశంలో రైతు బజారు ఏర్పాటు కావడం ముదావహం అన్నారు.

శాసన సభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ అభివృద్ధి పథంలో కూటమి నడుస్తుందన్నారు. రెండు అంతస్తుల భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. వంద స్టాల్ లు వస్తాయని చెప్పారు. మార్కెటింగ్ శాఖ నిర్వహణ చేస్తుందన్నారు. మరుగుదొడ్ల సౌకర్యం, పార్కింగ్ కల్పించడం జరుగుతుందని తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్రా అప్పారావు మాట్లాడుతూ రూ. 2 కోట్ల వ్యయంతో రైతు బజారు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కూరగాయలతో పాటు పండ్లు, పూల మార్కెట్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖసంచాలకులు శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి,గాదె వెంకటేశ్వరరావు, పిల్లి మాణిక్య రావు తదితరులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ పోటీలలో క్రీడాకారుల సత్తా

అమరావతి, మే 15:ఇటీవల రాజస్థాన్లోని ఉదయపూర్ లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు పాల్గొని వివిధ విభాగాలలో మెడల్స్ సాధించడం పట్ల స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.



ఎన్టీఆర్ స్టేడియం ప్రయాణంలో నేడు జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను స్టేడియం కమిటీ అభినందించి. వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా తాము నిరంతరం క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించడం జరుగుతుందని. తద్వారా తమ క్రీడాకారులు దేశవ్యాప్తంగా ఎక్కడ క్రీడా పోటీలు జరిగిన వాటిలో పాల్గొని మెడల్స్ సాధించడం జరుగుతుందని తెలియజేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఐదుగురు క్రీడాకారులు వివిధ విభాగాలలో పాల్గొని మెడల్స్ సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది అన్నారు. రాబోయే కాలంలో కూడా మరింత ఉత్తమమైన శిక్షణ అందించి క్రీడాకారులను నేషనల్ పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు.

చిన్నతనం నుండి క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు స్టేడియం ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నామని, ఈ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి తమ కోచ్ లు తర్వాత కూడా శిక్షణ అందించి వాళ్ళని ఉత్తమ క్రీడాకారులుగా మలిచేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిల్లారపు రంగ ప్రసాద్, స్టేడియం లైఫ్ మెంబర్ లక్ష్మీ కృష్ణ వరప్రసాద్ పాల్గొన్నారు.

# 2026 ఫలితాలు విడుదల




అమరావతి, మే 15:ఆంధ్రవిశ్వ విద్యాలయంలో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో నిర్వహించే ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూఈఈటి -2026 ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తన కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డీన్ ఆచార్య కె.శ్రీనివాస రావు, ఆచార్య వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 7 ప్రధాన నగరాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 5327 మంది దరఖాస్తు చేయగా 4707 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరికి మార్కుల ఆధారంగా ర్యాంకులను కేటాయించారు. త్వరలో ఆన్‌లైన్‌లో సర్టిఫికేట్‌ల పరిశీలన, కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. ప్రత్యేక విభాగాల వారికి పెదవాల్తేరులోని సంచాలకుల కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.ప్రవేశ పరీక్షలో విజయనగరానికి చెందిన జి.జయరాం 84 మార్కులతో ప్రధమ స్ధానంలో నిలచాడు. పల్నాడుకు చెందిన జి.వెంకట భువన తేజ 2వ ర్యాంకును, ప్రకాశం జిల్లా సింగరాయ కొండకు చెందిన షేక్ నౌషీర్ 3వ ర్యాంకు, శ్రీకాకుళంకు చెందిన వి.మురళీకృష్ణ 4వ ర్యాంకు, శ్రీకాకుళంకు చెందిన కె.లిఖిత్ 5వ ర్యాంక్ పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విసి ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందనలు తెలియజేశారు .

# భారత్‌లో టెక్స్‌టైల్ రీసైక్లింగ్‌పై ప్రసార మాధ్యమాల్లో ఇటీవలి కథనాలకు ఖండన

న్యూఢిల్లీ, మే 15:ఈ మధ్య అంతర్జాతీయ ప్రసార మాధ్యమాల్లో వచ్చిన ఒక కథనంలో.. హర్యానాలోని పానిపట్ వంటి క్లస్టర్లలో టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కార్యకలాపాలపై ప్రశ్నలను లేవనెత్తారు. ఈ రిపోర్టులు భారత్‌లో టెక్స్‌టైల్ రీసైక్లింగుకు సంబంధించిన అనుబంధ విస్తారిత వ్యవస్థ (ఇకోసిస్టమ్)లో కొన్ని విభాగాలతో ముడిపడిన పర్యావరణ పరమైన, వృత్తిపరమైన కోణాలను వెలువరించాయి. ఏ పెద్ద పారిశ్రామిక రంగంలోనైనా నియమాల అతిక్రమణకు సంబంధించిన చెదురుమదురు వ్యవహారాలు చోటుచేసుకోవచ్చు, కానీ వాటి ఆధారంగా పూర్తి భారత్‌లో వస్త్ర పరిశ్రమను 'పర్యావరణం పట్ల బాధ్యతను పట్టించుకోని' లేదా 'సంస్థాగతంగా దోపిడీకి వీలు ఉన్నది'గా స్థూల ప్రాతిపదికన వర్ణించడం తప్పుదోవ పట్టించేదిగా, ఎంపిక చేసుకొని మరీ దాడి చేసిందిగానే కాక వాస్తవాలకు భిన్నంగా కూడా ఉంది. ఈ దృష్టికోణం.. దేశమంతటా అమలవుతున్న నియంత్రణ పరమైన పటిష్టీకరణ, సాంకేతికత ఆధునికీకరణలతో పాటు స్థిరత్వం పైన తదేక శ్రద్ధ తీసుకుంటూ అమలు చేస్తున్న కార్యక్రమాల వంటి సానుకూల మార్పుల్ని ఉపేక్షిస్తూ, సరైన ప్రాతినిధ్యాన్ని వహించేదిగా లేనేలేదు.

ముందుగా, చెప్పుకోవాల్సింది ఏమిటంటే భారత్‌లో ప్రపంచంలోకెల్లా అతి పెద్ద వస్త్ర సంగ్రహణ (టెక్స్‌టైల్ రికవరీ), పునరుపయోగ (రీసైక్లింగ్) నెట్‌వర్కు నెలకొంది. దీనికి వస్త్ర సామగ్రి పునర్వినియోగం, మరమ్మతు, రీసైక్లింగ్, రీపర్పసింగ్ కోసమే నెలకొల్పిన వేల్యూ చైన్ల ఊతం లభిస్తోంది. అనేక ఇతర దేశాల (అక్కడ వస్త్ర వ్యర్థాలను ప్రధానంగా భూమిని తవ్వి ఆ గుంటల్లో పూడ్చేస్తున్నారు) మాదిరిగా కాకుండా, భారత్‌లో వస్త్ర వ్యర్థాల్లో చాలా వరకూ సాంప్రదాయిక, సాంప్రదాయేతర వ్యవస్థల ద్వారా రికవరీకి మొగ్గు చూపుతున్నారు. దీనిని ద్వితీయ వినియోగం, ఫైబర్ రికవరీ, పారిశ్రామిక పునరుపయోగాలతో పాటు సంబంధిత అప్లికేషన్ల దిశగా మళ్లిస్తున్నారు.

భారత్‌లో సామగ్రి రికవరీ స్థాయి ఊహించిన దాని కన్నా చాలా ఎక్కువగా ఉందని వస్త్ర వ్యర్థాలకు సంబంధించిన సాక్ష్యం నిరంతరాయంగా చాటిచెబుతోంది. "భారత్‌లో వస్త్ర వ్యర్థాల వేల్యూ చైన్ మ్యాపింగ్"కు సంబంధించి 2026 సంవత్సరంలో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం.. భారత్‌లో ఏటా దాదాపు 7,073 కిలో టన్నుల టెక్స్‌టైల్ వ్యర్థాలు వస్తున్నాయి. వీటిలో ప్రి-కన్స్యూమర్ వ్యర్థాలతో పాటు పోస్ట్-కన్స్యూమర్ వస్త్ర వ్యర్థాలూ ఉంటున్నాయి. తయారీ ప్రక్రియల్లో భాగంగా ఉత్పన్నమయ్యే ప్రి-కన్స్యూమర్ వస్త్ర వ్యర్థ పదార్థాల రికవరీ రేటు బాగా ఎక్కువగా ఉందని, మొత్తం ప్రి-కన్స్యూమర్ వ్యర్థాల్లో 97 శాతం పునరుపయోగం అవుతోందని, ఇది స్థానిక తయారీ వ్యవస్థల్లో మొదటి నుంచే అంతర్గతంగా ఉన్నత స్థాయిలో సామగ్రి సర్క్యులారిటీని సూచిస్తోందని అధ్యయనంలో పేర్కొన్నారు.

భారత్ ప్రధానంగా పశ్చిమ దేశాల ఫాస్ట్-ఫ్యాషన్ వేస్ట్ కు "డంపింగ్ గ్రౌండ్"గా పనిచేస్తోందని వార్తాకథనంలో తప్పుడు సంకేతాన్ని అందించారు. పైన ప్రస్తావించిన రిపోర్టులోని గణాంకాలు భారతీయ రీసైక్లింగ్ పరిశ్రమ విశేషించి దేశీయ అవసరాలతో ప్రేరణను పొంది, మనుగడను సాగిస్తోందని వెల్లడిస్తోంది. ప్రతి సంవత్సరం నిర్వహణకు నోచుకుంటున్న ఇంచుమించు 78 లక్షల టన్నుల వస్త్ర వ్యర్థాల్లో 90 శాతం కన్నా ఎక్కువగా దేశీయ ప్రి-కన్స్యూమర్, పోస్ట్-కన్స్యూమర్ వ్యర్థాల నుంచే అందుతోంది. దిగుమతి చేసుకుంటున్న పోస్ట్-కన్స్యూమర్ వ్యర్థాలు మొత్తం వ్యర్థాల్లో సుమారు 7 శాతం మాత్రమే ఉన్నాయి. వీటిని అపాయకర, ఇతర వ్యర్థాల (మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌బౌండరీ మూవ్‌మెంట్) నియమావళి-2016లో భాగంగా కఠినమైన పద్ధతుల్లో నియంత్రిస్తున్నారు. ఇలా దిగుమతి చేసుకున్న వ్యర్థాల్లో ప్రధానంగా పాత దుస్తులు, చిరిగిన చింకి-పాత పీలికలు కలిసి ఉంటాయి.. వీటిని చాలావరకూ హార్మొనైజ్‌డ్ సిస్టమ్ కోడ్ ద్వారా గుర్తిస్తారు. ఈ ప్రవాహాన్ని చాలావరకూ సాంప్రదాయికంగానూ, విశేషించి పునరుపయోగ ప్రధానమైన, సరికూర్చే ప్రణాళిక (సార్టింగ్) లోకి మళ్లిస్తారు.

"భారత్‌లో వస్త్ర వ్యర్థాల నుంచి విలువను రాబట్టడం: జౌళి రంగంలో చక్రీయతకు ఉద్దేశించిన మార్గ సూచీ" శీర్షికతో విడుదల చేసిన ఎఫ్ఐసీసీఐ నివేదికలో భారత్ వస్త్ర వ్యర్థాల అనుబంధ విస్తారిత వ్యవస్థ ప్రస్తుతం ఏటా రూ.22,000 కోట్లకు పైగా విలువైందిగా వివరించారు. దీనిలో సార్టింగ్, వేరుచేసే ప్రక్రియలతో పాటు అధిక విలువ కలిగిన పునరుపయోగ ప్రక్రియల్ని చేపట్టడం ద్వారా కూడా అదనపు విలువను రాబట్టుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు, భారత్‌లో పునరుపయోగం, మరమ్మతు ప్రక్రియలతో సాంప్రదాయికంగా తలసరి వస్త్ర వినియోగ, వ్యర్థ ఉత్పాదన స్థాయుల్ని పరిశీలిస్తే అవి అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చి చూసినప్పుడు చాలా తక్కువగా కూడా ఉన్నాయి. ఈ నిర్ధారణలు భారత్‌లో వస్త్రాల పునరుపయోగం కేవలం వ్యర్థాల నిర్వహణ కార్యకలాపంగానే పరిమితం కాకుండా జీవనోపాధి, వనరుల వినియోగ పరంగా దక్షత, రెండో స్థాయి సామగ్రి నుంచి విలువను రాబట్టుకోవడంలో కూడా విశిష్టమైన తోడ్పాటును అందిస్తోందని స్పష్టం చేస్తున్నాయి.

పర్యావరణానికి టెక్స్‌టైల్ రీసైక్లింగ్ హానికారకం అని చెబుతున్న వర్ణనలకు భిన్నంగా, ఐఐటీ ఢిల్లీ పరిశోధకులు నిర్వహించిన 'లైఫ్ సైకిల్ అసెస్‌మెంట్.. ఎల్‌సీఏ' అధ్యయనం భారత పునరుపయోగ కార్యకలాపాలతో సమకూరే ప్రధాన పర్యావరణ లాభాలను వివరించింది. ఈ అధ్యయనం కోసం పానిపట్ క్లస్టర్ నుంచి కూడా క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించారు. టెక్స్‌టైల్ రీసైక్లింగ్ ప్రక్రియ.. గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాలు, ఆమ్ల వర్షం అవకాశాలు, శిలాజ జనిత ఇంధన క్షయం వంటి కీలక పర్యావరణ సంబంధిత దుష్ప్రభావాలను 30 నుంచి 40 శాతం వరకు తగ్గించేస్తుందని మరో సమకాలిక సమీక్ష 'జర్నల్ ఆఫ్ క్లీనర్ ప్రొడక్షన్ - 2025' లో ప్రచురించిన ఒక పరిశోధన పత్రం (దీని రూపకల్పనకూ పానిపట్ రీసైక్లింగ్ క్లస్టర్ నుంచి డేటాను తీసుకున్నారు) కూడా తేల్చి చెప్పింది.

భారత్‌లో టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కొన్ని ఎంపిక చేసిన యూనిట్లకే పరిమితం కాలేదని, ఈ ప్రక్రియను పానిపట్, తిరుప్పూర్, లూథియానా, సూరత్ తదితర వస్త్ర కేంద్రాలలో కూడా ప్రత్యేక పారిశ్రామిక అనుబంధ విస్తారిత వ్యవస్థల్లోనూ అనుసరి స్తున్నారన్నదీ ప్రాసంగికమే. మీడియా కథనాల్లో తరచు ప్రస్తావిస్తున్న పానిపట్ ప్రపంచ స్థాయిలో ప్రముఖ టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కూడళ్లలో ఒకటిగా ఎదిగింది. పానిపట్‌లో ఉన్ని, మిశ్రిత వస్త్రాల వ్యర్థాల ప్రాసెసింగ్ చెప్పుకోదగిన పరిమాణంలో కొనసాగుతోంది. దీంతో జీవనోపాధి కార్యకలాపాలకూ, ఆర్థిక కార్యకలాపాలకు పానిపట్ ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు అవుతోంది.

అదే సమయంలో, మీడియా కథనాల్లో ప్రస్తావనకు వచ్చిన కొన్ని అంశాలు గమనించదగ్గవి. దీనికి కారణం వినియోగదారు సంస్థల ఉపయోగానంతర వస్త్ర వ్యర్థాల సేకరణ, మిశ్రిత సింథటిక్ టెక్స్‌టైల్ వ్యర్థాల నిర్వహణ, చీలికలు వాలికలైన ముడి సామగ్రిని పోగుచేయడం, చిన్న సంప్రదాయేతర యూనిట్ల నడుమ పర్యావరణ నియమాల పాలన, వేల్యూ చైన్‌లోని కొన్ని భాగాల్లో శ్రామికుల భద్రత వంటి సవాళ్లు ఇప్పటికీ కొనసాగుతుండడమే. ఏమైనా, ఈ ఆందోళనలను ఒక ప్రగతిశీల రంగం దృష్టికోణంలో నుంచి పరిశీలించాల్సివుంది. ఈ రంగం నిరంతరం మరింత సంప్రదాయీకరణ దిశగా, నియంత్రణపరంగా కఠినతర నియమాలను పాలించే దిశగా, స్వచ్ఛ ఉత్పాదక సాంకేతికతలను స్వీకరించే దిశగా పురోగమిస్తోంది.

# 'వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం-2026' జాతీయ క్విజ్ ప్రారంభం

న్యూఢిల్లీ, మే 15:హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో మై భారత్ ద్వారా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం (వీవీవీపీ) -2026 కోసం జాతీయ స్థాయి క్విజ్‌ను ప్రారంభించింది. మై భారత్ వెబ్‌సైట్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. 2026 జూన్‌లో సరిహద్దు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే యువతను ఎంపిక చేయడంలో మొదటి దశగా ఈ క్విజ్ జరుగుతుంది.

యువత నేతృత్వంలో చేపట్టే జాతీయ కార్యక్రమమే వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం - 2026. లేహ్-లదాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ప్రాంతాల్లోని సరిహద్దు గ్రామాల అభివృద్ధిలో క్షేత్రస్థాయిలో పాల్గొనడాన్ని, సామాజిక భాగస్వామ్యాన్ని, సాంస్కృతిక వినిమయాన్ని, అవగాహనను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

దేశవ్యాప్తంగా 2026 మే 10 నుంచి 20 వరకు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తారు. వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం దార్శనికత, లక్ష్యాల గురించి పోటీదారుల్లో అవగాహన పెంపొందించడం, దేశ నిర్మాణంలో, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి లో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

సరిహద్దు గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్కృతి, పర్యావరణ అవగాహన, పరిపాలన కార్యకలాపాలు, సమాజ భాగస్వామ్యం, సరిహద్దు ప్రాంతాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాల గురించి తెలుసుకొనే వేదికగా ఈ క్విజ్ పనిచేస్తుంది.

క్విజ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి అర్హత, శారీరక ధారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 500 మంది మై భారత్ స్వచ్ఛంద సేవకులను 2026 జూన్లో నిర్వహించే వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాంలో ఒక వారం పాటు పాల్గొనేందుకు ఎంపిక చేస్తారు.

గుర్తించిన సరిహద్దు గ్రామాల్లో క్షేత్రస్థాయి కార్యక్రమాల్లోనూ, సామాజిక కార్యకలాపాల్లోనూ ఎంపికైన స్వచ్ఛంద సేవకులు నిమగ్నమవుతారు. క్షేత్రస్థాయి అభివృద్ధికి, జాతీయ సమైక్యతకు సంబంధించిన స్వచ్ఛతా డ్రైవ్‌లు, యువతతో చర్చలు, పర్యావరణ పరమైన కార్యక్రమాలు, సాంస్కృతిక వినిమయ కార్యకలాపాలు, అవగాహన సదస్సులు, కెరీర్ కౌన్సిలింగ్ సెషన్లు, ప్రయోగాత్మక అభ్యాస అవకాశాలపై దృష్టి సారిస్తారు.

2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యంలో చురుకైన భాగస్వామిగా యువతను శక్తిమంతం చేయాలనే ప్రభుత్వం అంకిత భావాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. అలాగే శక్తిమంతమైన, స్థిరమైన సరిహద్దు సమాజాలకు ఇస్తున్న ప్రాధాన్యంపై అవగాహనను పెంపొందిస్తుంది.

# తూత్తుకుడిలో భారత మొట్టమొదటి మెగా గ్రీన్ ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు కోసం చారిత్రాత్మక అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, మే 15:భారత నౌకాయాన రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా, తమిళనాడులోని తూత్తుకుడిలో దేశ మొట్టమొదటి మెగా గ్రీన్ ఫీల్డ్ షిప్‌యార్డ్ అభివృద్ధి కోసం 2026 ఏప్రిల్ 20న త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదిరింది. నౌకానిర్మాణ రంగంలో ప్రపంచ దిగ్గజం హెచ్‌డి కొరియా షిప్‌బిల్డింగ్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ (హెచ్‌డి కెఎస్‌ఓఈ), భారత ప్రభుత్వ నౌకాశ్రయం వి.ఓ. చిదంబరనార్ పోర్ట్ అథారిటీ (వీఓసీపీఏ), తమిళనాడు ప్రభుత్వ సంస్థ సిప్‌కాట్ (ఎస్ఐపీసీఓటీ) కలిసి ఏర్పాటు చేసిన ఎన్‌షిప్-టిఎన్ (ఎన్‌షిప్-టిఎన్), కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ పరిధిలోని సాగరమాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్ఎంఎఫ్సీఎల్) ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి.

కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ భారత పర్యటనలో భాగంగా, 2026 ఏప్రిల్ 20న కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జల రవాణా శాఖ మంత్రి సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ మధ్య జరిగిన సమావేశం అనంతరం ప్రారంభించిన భారత్ - కొరియా సమగ్ర భాగస్వామ్య వ్యవస్థ- సామర్థ్యం, విస్తృతితో కూడిన నౌకానిర్మాణ కేంద్ర ఆధారిత వృద్ధి నిర్వహణ ఉమ్మడి దార్శనికత (వాయేజెస్) కింద ఈ ఒప్పందం కుదిరింది. నౌకానిర్మాణం, నౌకాయానం, సముద్ర రవాణా రంగాల్లో భాగస్వామ్యం కోసం ఈ వ్యవస్థ ఏర్పాటైంది.

భారత-కొరియా నౌకాయాన సహకార వ్యవస్థ తొలి అమలు ఫలితాలలో తూత్తుకుడి గ్రీన్ ఫీల్డ్ షిప్‌యార్డ్ ఒకటిగా నిలుస్తుంది. నౌకాయాన రంగంలో రెండు దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇది సూచిస్తుంది.

తూత్తుకుడిలో ఏటా 2.5 మిలియన్ గ్రాస్ టన్నేజ్ (జీటీ) సామర్థ్యం గల అంతర్జాతీయ స్థాయి మెగా షిప్‌యార్డ్ ఉమ్మడి అభివృద్ధి, ఆర్థిక సహకారం, నిర్మాణం, నిర్వహణకు ఈ ఒప్పందం పునాది వేస్తుంది. ఈ ప్రాజెక్టు కార్యకలాపాలు స్థిరపడిన తర్వాత సుమారు 15,000 ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనితో పాటు తమిళనాడు, చుట్టుపక్కల ప్రాంతాలలో గణనీయమైన పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి.

ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఎన్‌షిప్-టిఎన్ అభివృద్ధి చేస్తున్న తూత్తుకుడి నౌకానిర్మాణ సముదాయానికి ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ ప్రక్రియ కొనసాగుతోంది. తూత్తుకుడిలో ప్రతిపాదించిన ఈ గ్రీన్ ఫీల్డ్ నౌకానిర్మాణ కేంద్ర సముదాయానికి భారత ప్రభుత్వ నేషనల్ షిప్‌బిల్డింగ్ మిషన్ నుంచి సూత్రప్రాయ ఆమోదం కూడా లభించింది.

2047 నాటికి ఏటా 4.5 మిలియన్ గ్రాస్ టన్నేజ్ నౌకానిర్మాణ ఉత్పత్తిని సాధించడం ద్వారా ప్రపంచంలోని మొదటి ఐదు నౌకానిర్మాణ దేశాలలో ఒకటిగా నిలవడం భారత సముద్రయాన అమృత్ కాల్ విజన్ 2047 లక్ష్యం. తూత్తుకుడిలో ప్రతిపాదించిన ఈ కేంద్రం ఏటా 2.5 మిలియన్ గ్రాస్ టన్నేజ్ సామర్థ్యంతో భారత వాణిజ్య నౌకానిర్మాణ రంగాన్ని సమూలంగా మారుస్తుందని, దేశ ప్రస్తుత నౌకానిర్మాణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు.

నౌకానిర్మాణ సామర్థ్యం పెంచడమే కాకుండా, అనుబంధ విడిభాగాల తయారీ కేంద్రాల ద్వారా సమగ్ర నౌకాయాన పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఊతమిస్తుంది. సముద్రయాన పరికరాలు, ఇంజనీరింగ్ సరఫరా వ్యవస్థల స్వదేశీకరణ, కార్మికులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, అత్యాధునిక తయారీ పద్ధతులు, డిజిటల్ నౌకానిర్మాణం, పర్యావరణ హిత నౌకాయాన సాంకేతికతలను అందిపుచ్చుకోవడం వంటి అంశాలకు ఇది మార్గం సుగమం చేస్తుంది. ఈ భాగస్వామ్యం వల్ల కొరియాలోని హెచ్‌డి కెఎస్‌ఓఈ కేంద్రాలలో భారతీయ నౌకానిర్మాణ నిపుణులకు, కార్మికులకు శిక్షణ పొందే అవకాశం కూడా లభిస్తుంది.

భారతదేశాన్ని అంతర్జాతీయంగా పోటీతత్వంతో కూడిన నౌకానిర్మాణ కేంద్రంగా మార్చేందుకు భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2025లో నాలుగు సూత్రాల విధానంతో కూడిన సుమారు ?70,000 కోట్ల సమగ్ర ప్యాకేజీని ప్రకటించింది. ఈ విధాన ప్యాకేజీ ప్రారంభమైనప్పటి నుంచి భారతీయ నౌకానిర్మాణ కేంద్రాలపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి, ఆర్డర్లు పెరుగుతున్నాయి. ఇది దేశ నౌకానిర్మాణ సామర్థ్యాలు, పర్యావరణహిత సాంకేతికత సన్నద్ధత పట్ల నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) కు ఆరు 1,700 టీఈయూ నౌకల కోసం సిఎమ్ఎ సిజిఎమ్ ఆర్డర్లు ఇచ్చింది. నార్వే లోని స్వాన్ ఎనర్జీకి చెందిన పిపావావ్ షిప్‌యార్డ్ నుంచి ఆరు కెమికల్ ట్యాంకర్ల కోసం, బ్రిటన్ నుంచి అమ్మోనియాతో నడిచే నాలుగు కంసార్‌మాక్స్ బల్క్ క్యారియర్ల కోసం అంతర్జాతీయ ఆర్డర్లను పొందింది.

ఈ సందర్భంగా కేంద్ర ఓడరేవులు, నౌకాయాన మంత్రి శర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, " ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ప్రపంచ నౌకాయాన శక్తిగా ఎదిగే భారత్ ప్రయాణంలో ఈ చారిత్రాత్మక ఒప్పందం ఒక కీలక ఘట్టం. 'వాయేజెస్' వ్యవస్థ పరిధిలోని ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ స్థాయి సాంకేతికతను, విస్తృతిని, ఆవిష్కరణలను, పర్యావరణ హిత నౌకానిర్మాణ సామర్థ్యాలను భారతదేశానికి తీసుకువస్తుంది. ఇది భారత వాణిజ్య నౌకానిర్మాణ సామర్థ్యాన్ని మార్చడమే కాకుండా, వేలాది మందికి నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను కల్పిస్తుంది. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేస్తుంది. అంతర్జాతీయ పోటీతత్వంతో మన నౌకాయాన వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 లక్ష్యం దిశగా భారతదేశం అడుగులు వేస్తున్న తరుణంలో, తూత్తుకుడి ప్రపంచానికి ఒక వ్యూహాత్మక నౌకాయాన, పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతుంది" అని అన్నారు.

ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం భారతదేశాన్ని ప్రపంచస్థాయిలో పోటీతత్వం కలిగిన నౌకాయాన తయారీ దేశంగా నిలబెట్టడంలో ఒక ప్రధాన అడుగు. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, అత్యాధునిక సాంకేతికతలు, సుస్థిర వృద్ధి ద్వారా భారీ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను నిర్మించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది మరింత బలోపేతం చేస్తుంది.

# పవర్ లిఫ్టింగ్ పోటీలలో క్రీడాకారుల సత్తా



అమరావతి, మే 15: ఇటీవల రాజస్థాన్లోని ఉదయపూర్ లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు పాల్గొని వివిధ విభాగాలలో మెడల్స్ సాధించడం పట్ల స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ స్టేడియం ప్రయాణంలో నేడు జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను స్టేడియం కమిటీ అభినందించి. వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా తాము నిరంతరం క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించడం జరుగుతుందని. తద్వారా తమ క్రీడాకారులు దేశవ్యాప్తంగా ఎక్కడ క్రీడా పోటీలు జరిగిన వాటిలో పాల్గొని మెడల్స్ సాధించడం జరుగుతుందని తెలియజేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఐదుగురు క్రీడాకారులు వివిధ విభాగాలలో పాల్గొని మెడల్స్ సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది అన్నారు. రాబోయే కాలంలో కూడా మరింత ఉత్తమమైన శిక్షణ అందించి క్రీడాకారులను నేషనల్ పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు.

చిన్నతనం నుండి క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు స్టేడియం ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నామని, ఈ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి తమ కోచ్ లు తర్వాత కూడా శిక్షణ అందించి వాళ్ళని ఉత్తమ క్రీడాకారులుగా మలిచేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిల్లారపు రంగ ప్రసాద్, స్టేడియం లైఫ్ నెంబర్ లక్ష్మీ కృష్ణ వరప్రసాద్ పాల్గొన్నారు.

# లైబ్రరీ ఒక విజ్ఞాన గని

## -ఘనంగా గ్రంథాలయ దినోత్సవ వేడుకలు
## -విద్యావారోత్సవాల్లో డీఈఓ విజయ కుమారి

మేడ్చల్, మే 15: సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' విద్యావారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో 'లైబ్రరీ డే' (గ్రంథాలయ దినోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లైబ్రరీ అనేది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పరిశోధకులకు ఒక పవిత్రమైన దేవాలయం వంటిదని కొనియాడారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లోని ఇతర పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. మన చరిత్ర, సంస్కృతి భాషా సంపదను పుస్తకాల రూపంలో భావితరాలకు అందించే గొప్ప వేదిక గ్రంథాలయమని తెలిపారు. అనంతరం, లైబ్రరీలో అత్యధికంగా పుస్తకాలు చదివే బెస్ట్ రీడర్స్ ను గుర్తించి, చైర్మన్ చేతుల మీదుగా వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్ రిటైర్డ్ ఎస్టీఓ, మేడ్చల్ మండల విద్యాశాఖాధికారి శంకరయ్య, స్థానిక నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాఠకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నా దేశం నా బాధ్యత అనే నినాదంతో ముందుకు సాగాలి

## -మంత్రి కొల్లు రవీంద్ర
## -ప్రజాదర్బార్ కార్యక్రమానికి సైకిల్ పై మంత్రి

మచిలీపట్నం, మే 15: ప్రజలందరూ నా దేశం నా బాధ్యత అనే నినాదంతో ముందుకు సాగాలని రాష్ట్ర గనులు



భూగర్భనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంత్రి రవీంద్ర సైకిల్ పై వచ్చారు. ప్రధాని పిలుపుమేరకు ఆయన ఇంటి వద్ద నుంచి కార్యాలయానికి సైకిల్ మీద వచ్చి ప్రజానీకానికి తన సంకేతాన్ని అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధ నేపథ్యంలో దేశంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైతున్న దృష్ట్యా ముందస్తుగానే ప్రజల్ని అప్రమత్తం చేసిన ప్రధాని పిలుపును అందరూ గౌరవించాలన్నారు దానిలో భాగంగానే ఇందనంతో పాటు వంటనూనె గ్యాస్ తదితర ఖర్చులన్నింటిని పరిమితం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం తమ కాన్వాయ్ లను తగ్గించుకొని ఖర్చును ఆదాసేస్తున్నట్టు తెలిపారు. దాంట్లో బాగానే ఈరోజు ప్రజా దర్బార్ కు సైకిల్ పై హాజరు కావడం జరిగిందన్నారు.

## నాలుగో భారత్ - ఆఫ్రికా ఫోరం సదస్సు సందర్భంగా నిర్వహించే

# భారత్ - ఆఫ్రికా వాణిజ్య చర్చలు, ప్రదర్శనకు సన్నాహక కార్యక్రమం

న్యూఢిల్లీ, మే 15:నాలుగో భారత్ - ఆఫ్రికా ఫోరమ్ సదస్సు (ఐఎఫ్ఎస్-ఎఎ) సందర్భంగా త్వరలో నిర్వహించనున్న భారత్ - ఆఫ్రికా వాణిజ్య చర్చలు (ఐఏబీడీ), ప్రదర్శనకు సన్నాహక కార్యక్రమాన్ని 2026 మే 13న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆఫ్రికా దేశాల రెసిడెంట్ అంబాసిడర్లు, హై కమిషనర్లు, భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక సంఘాలు, సంస్థలు, ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల (ఈపీసీలు) ప్రతినిధులు, వ్యాపార సంస్థలు, భారత్, ఆఫ్రికాలకు చెందిన సంబంధిత భాగస్వామ్య ప్రముఖులు హాజరయ్యారు.

వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు, ప్రజల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా.. భారత్, ఆఫ్రికా దేశాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసే అత్యున్నత వేదికగా ఐఏబీడీ, ప్రదర్శనను రూపొందించారు.

సభనుద్దేశించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ప్రసంగిస్తూ.. శతాబ్దాల నాటి నౌకావాణిజ్య సంబంధాలు, వలసవాద వ్యతిరేక పోరాటాల్లో సంఘీభావం, బలమైన సామాజిక - సాంస్కృతిక బంధాలతో ముడిపడి ఉన్న భారత్ - ఆఫ్రికా చారిత్రక, నాగరికతా సంబంధాలను వివరించారు. భారత్, ఆఫ్రికా కలిసి అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం మరింత సమ్మిళిత, పటిష్టమైన, ఆవిష్కరణలు చోదకంగా ఉన్న భవితను రూపుదిద్దగలవని ఆయన వ్యాఖ్యానించారు.

భారత్ - ఆఫ్రికా ఆర్థిక సంబంధాలు ఇటీవలి కాలంలో బలమైన వృద్ధిని సాధించాయని కేంద్ర మంత్రి చెప్పారు. భారత్, ఆఫ్రికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2025?26లో 93.69 బిలియన్ డాలర్లకు చేరుకుందని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 14.39 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. ఇదే కాలంలో ఆఫ్రికాకు భారత ఎగుమతులు 45.42 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 48.27 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయన్నారు.

రెండు వైపులా వ్యాపారాలు మరింత వేగంగా, నిరంతరాయంగా వృద్ధి చెందడానికి వీలుగా.. ప్రస్తుత వాణిజ్య సంబంధాలను, ప్రాధాన్యత వాణిజ్య చట్రాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని కేంద్ర మంత్రి అన్నారు. దీని కోసం ప్రమాణాలను, కస్టమ్స్ విధానాలను, వ్యాపార పద్ధతులను ఒకే తాటిపైకి తీసుకురావాలని సూచించారు. భారత్ - ఆఫ్రికా మధ్య సహకారానికి ఉన్న అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని ఆయన వివరిస్తూ.. దాదాపు 3.4 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆఫ్రికా ఖండ స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతం (ఏఎఫ్‌సీఎఫ్‌టీఏ), వేగంగా విస్తరిస్తున్న భారత 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిసి అద్భుత అవకాశాలను సృష్టిస్తాయని వ్యాఖ్యానించారు. అధిక విలువ కలిగిన తయారీ రంగం, అన్ని దశల్లోనూ సమగ్ర సమన్వయం దిశగా పటిష్టమైన భాగస్వామ్యాలను ఏర్పరచుకోవాలని, వివిధ మార్గాల్లో సరఫరా వ్యవస్థలను ప్రోత్సహించాలని, ముడి పదార్థాల వాణిజ్యానికే పరిమితం కావద్దని ఆయన పిలుపునిచ్చారు.

భారత్ - ఆఫ్రికా సహకార భవితను రూపుదిద్దడంలో సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, అభివృద్ధిలో యువత ముందుండి నడపడం కీలకమని మంత్రి వ్యాఖ్యానించారు. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ఎలక్ట్రిక్ రవాణా, డిజిటలైజేషన్, టెలికమ్యూనికేషన్ల వంటివి పరస్పర సహకారానికి ప్రధాన రంగాలుగా ఆయన గుర్తించారు. భారత్, ఆఫ్రికా జనాభాలో దాదాపు మూడింట రెండు వంతుల మంది 35 ఏళ్లలోపు వారేనని గుర్తు చేస్తూ.. భవిష్యత్తు పరిశ్రమల కోసం నైపుణ్యాభివృద్ధి, అంకుర సంస్థలు, ఆవిష్కరణ వ్యవస్థలు, ప్రతిభను పెంపొందించడంపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల కామెరూన్‌లో నిర్వహించిన 14వ డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సులో వినిపించిన ఒక సామెతను గుర్తుచేశారు. 'ఒక్క చేత్తో కట్టను కట్టలేము' అన్న సామెతను ఉటంకిస్తూ.. ఉమ్మడి శ్రేయస్సు, సమ్మిళిత అభివృద్ధి కోసం ఆఫ్రికా దేశాలతో బలమైన, శాశ్వతమైన భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడానికి భారత్ కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

భారత్ - ఆఫ్రికా భాగస్వామ్యం తదుపరి దశలో కేవలం సంప్రదాయ ముడి పదార్థాల వాణిజ్యానికే పరిమితం కాకుండా, అధిక విలువ కలిగిన ఉత్పత్తులు, సమగ్ర సరఫరా వ్యవస్థలు, స్థానిక తయారీ, సాంకేతికత చోదకంగా ఉన్న సహకారం దిశగా సాగాలని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. వ్యవసాయం, ఆహార శుద్ధి, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు, పునరుత్పాదక ఇంధనం, కీలక ఖనిజాలు, ఎలక్ట్రిక్ రవాణా, తయారీ రంగం, రక్షణ ఉత్పత్తి, అత్యాధునిక సాంకేతికతలను భవిష్యత్తు సహకారానికి కీలక రంగాలుగా ఆయన పేర్కొన్నారు.

ఆఫ్రికా ఖండ స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతం (ఏఎఫ్‌సీఎఫ్‌టీఏ) తీసుకురాగల విప్లవాత్మక మార్పులను మంత్రి వివరించారు. ఆఫ్రికాలోని ప్రాంతీయ ఆర్థిక సమూహాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్న భారత్ నిశ్చయాన్ని ఆయన స్పష్టం చేశారు. దక్షిణ దేశాల మధ్య బలమైన వాణిజ్య కారిడార్లను నిర్మించాల్సిన అవసరముందన్నారు. సరఫరా వ్యవస్థలో వైవిధ్యం, మెరుగైన లాజిస్టిక్స్, పర్యావరణ హిత భాగస్వామ్యాల ద్వారా 2030 నాటికి భారత్ - ఆఫ్రికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న ఉమ్మడి లక్ష్యాన్ని ఆయన వివరించారు.

ఈ సందర్భంగా వాణిజ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి చరిత్ర, వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలు, అభివృద్ధి కాంక్షలతో కూడిన సుదీర్ఘమైన, బహుముఖీన భాగస్వామ్యం భారత్, ఆఫ్రికా మధ్య ఉందని వ్యాఖ్యానించారు. త్వరలో నిర్వహించనున్న భారత్ - ఆఫ్రికా వాణిజ్య చర్చ, ప్రదర్శన.. ఇరుపక్షాల విధాన నిర్ణేతలు, పారిశ్రామిక ప్రముఖులు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, అభివృద్ధి సంస్థలు, పారిశ్రామికవేత్తలను ఒక్కచోటకు తెచ్చే కీలక వేదికగా నిలుస్తుందని ఆయన వివరించారు.

పర్యావరణ చర్యలు, సుస్థిరత, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, డిజిటల్ ఆవిష్కరణలు, కృత్రిమ మేధ, తయారీ రంగం, ఎంఎస్ఎంఈ భాగస్వామ్యాలు, ఆరోగ్య సంరక్షణ, మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక సేవలు, లాజిస్టిక్స్, వ్యూహాత్మక సహకారం, కీలక ఖనిజాల వంటి వివిధ ప్రత్యేక అంశాలపై ఈ కార్యక్రమం ప్రధానంగా దృష్టి సారిస్తుందని వాణిజ్య కార్యదర్శి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్వసభ్య సమావేశాలు, విధానపరమైన చర్చలు, రంగాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు, బీ2బీ, బీ2జీ భేటీలు, నెట్‌వర్కింగ్ సమావేశాలు నిర్వహిస్తారు. అలాగే భారత్, ఆఫ్రికా మధ్య సాంకేతికతలు, ఆవిష్కరణలు, రంగాలవారీగా ఉత్తమ పద్ధతులు, సహకారానికి సంబంధించిన విజయగాథలను ప్రదర్శించేలా అంశాలవారీ ప్రదర్శనను కూడా ఏర్పాటు చేస్తారు.

ఇటీవల జరిగిన 10వ భారత్ - కెన్యా సంయుక్త వాణిజ్య కమిటీ, 5వ భారత్ - టాంజానియా సంయుక్త వాణిజ్య కమిటీ సమావేశాలను కూడా వాణిజ్య కార్యదర్శి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల సమీక్ష, పెట్టుబడుల సహకారాన్ని బలోపేతం చేయడం, కొత్త భాగస్వామ్య రంగాలను గుర్తించడంపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. ఆఫ్రికా దేశాలతో భారత ఆర్థిక సంబంధాల్లో పెరుగుతున్న వేగాన్ని, కీలక రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవాలన్న ఉమ్మడి నిశ్చయాన్ని ఈ చర్చలు ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

స్వల్పంగా అభివృద్ధి చెందిన దేశాల కోసం అమలు చేస్తున్న సుంకాల్లేని పన్ను ప్రాధాన్యతా (డీఎఫ్‌టీపీ) పథకం, పలు ఆఫ్రికా దేశాలతో కొనసాగుతున్న ద్వైపాక్షిక సంయుక్త వాణిజ్య కమిటీ యంత్రాంగాల వంటి కార్యక్రమాల ద్వారా.. ఆఫ్రికా భాగస్వాములతో వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం లక్ష్యంగా.. సంస్థాగత, విధానపరమైన చట్రాలను బలోపేతం చేసేందుకు భారత ప్రభుత్వ నిబద్ధతను ఈ సన్నాహక కార్యక్రమం స్పష్టం చేస్తోంది.

త్వరలో నిర్వహించనున్న భారత్ - ఆఫ్రికా వాణిజ్య చర్చలు, ప్రదర్శనకు ప్రతినిధులు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. వికసిత్ భారత్ 2047, ఆఫ్రికా ఎజెండా 2063 ఉమ్మడి లక్ష్యాలకు అనుగుణంగా.. భారత్ - ఆఫ్రికా ఆర్థిక సహకారాన్ని, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు.

భారత్ - ఆఫ్రికా వాణిజ్య చర్చలు, ప్రదర్శనతోపాటు నాలుగో భారత్ - ఆఫ్రికా ఫోరమ్ సదస్సు విజయవంతమయ్యేలా.. ఇరుపక్షాల ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమల సంఘాలు, ఆర్థిక సంస్థలు, అభివృద్ధి భాగస్వాములు విస్తృతంగా, క్రియాశీలకంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని భారత ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది.

## ఆయుష్ బహుభాషా డిజిటల్ సేవలను వృద్ధి చేయడానికి డిజిటల్

# ఇండియా భాషిణి విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్న ఆయుష్ శాఖ



న్యూఢిల్లీ, మే 15:ఆయుష్ మంత్రిత్వ శాఖకీ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ (డీఐబీడీ)కీ మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ)పై ఈ రోజు సంతకాలయ్యాయి. ఆయుష్ కి సంబంధించిన సమాచారాన్ని అనేక భారతీయ భాషల్లోకి వేగంగా అందించడంతో పాటు అనువాదానికి మార్గాన్ని సుగమం చేసే లక్ష్యంతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

"భాషిణి రాజ్యం- భాషిణి సహయోగి కార్యక్రమం" పేరిట చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా, ఆయుష్ మంత్రిత్వ శాఖ డిజిటల్ వేదికలు, సేవలతో భారత్ జాతీయ భాషా డిజిటల్ సేవల వేదిక 'భాషిణి' ను ఏకీకరించాలన్నదే ఈ భాగస్వామ్య ధ్యేయం.

ఆయుష్ శాఖ 'ఆయుష్ గ్రిడ్ కార్యక్రమం' సాయంతో ఆరోగ్య సంరక్షణ, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు, పరిశోధన, ఔషధ పరిపాలన, ఇతర సంబంధిత రంగాలలో కృషి చేస్తోంది. ఆయుష్ గ్రిడ్‌లో భాగంగా అభివృద్ధి చేసిన అనేక పోర్టళ్లు, అప్లికేషన్లు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాలను భారత రాజ్యాంగ ఎనిమిదో షెడ్యూలులో గుర్తింపు లభించిన మొత్తం 22 షెడ్యూల్డు భాషల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ఈ పనిని పూర్తి చేస్తే, వీటి విస్తృత లభ్యతతో పాటు ఉపయోగానికి కూడా వీలు కలుగుతుంది.

ఈ ఒప్పందంలో భాగంగా డిజిటల్ ఇండియా భాషిణి సాంకేతికతలను ఆయుష్ గ్రిడ్ పోర్టళ్లు, అప్లికేషన్లు, ఏఐ టూల్స్ సహా ఆయుష్ డిజిటల్ సొల్యూషన్స్‌తో అనుసంధానించనున్నారు. ఫలితంగా బహు భాషల్లో లభ్యతను బలోపేతం చేయడం సాధ్యమవుతుంది. డిజిటల్ వ్యాప్తిని దేశమంతటా విస్తరించవచ్చు. దీనికి తోడు, ఆయుర్వేదం, యునానీ, సిద్ధ, యోగ, ప్రాకృతిక వైద్యం (నేచరోపతి), సోవా-రిగ్పాలతో పాటు హోమియోపతీకి సంబంధించిన ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్ కమ్యూనికేషన్‌ను దృష్టిలో పెట్టుకొని డొమైన్-స్పెసిఫిక్ బహుభాషా టెర్మినాలజీ వ్యవస్థల్ని అభివృద్ధిపరచడం, ఆయుష్ భాషా డేటాసెట్లను పటిష్ఠపరచడంతో పాటు ఆయా సందర్భాలకు సరిపోయే ఏఐ మోడళ్లను తీర్చిదిద్దడానికి కూడా ప్రత్యేక ప్రయత్నాలను చేపడతారు.

ఎమ్ఓయూపై ఆయుష్ శాఖ డైరెక్టరు డాక్టర్ సుబోధ్ కుమార్, డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) శ్రీ అమితాభ్ నాగ్‌లు అధికారిక హోదాల్లో సంతకాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచాతో పాటు ఆయుష్ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కవితా జైన్‌ల సమక్షంలో నిర్వహించారు.

ఆయుష్ సమాచారం భారతీయ భాషలన్నిటిలో సులభంగా అందుబాటులో ఉండేటట్లు చూడటానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా స్పష్టం చేశారు. ఆయన ఇంకా ఇలా అన్నారు.."ఆయుష్ వైద్య వ్యవస్థల్లో అపారమైన నాగరికతా సంబంధిత జ్ఞానంతో పాటు సాంస్కృతిక గాఢత ఇమిడివుంది. ఈ జ్ఞానాన్ని ప్రతి భారతీయ భాషలోనూ సులభంగా అందుబాటులో ఉండేటట్లు, సమ్మిళిత ఆరోగ్యసంరక్షణ సేవల అందజేత సాధ్యపడేటట్లు, జనబాహుళ్యంలో చైతన్యం వెల్లివిరిసేటట్లు చూడటం ఎంతో అవసరం. ఆయుష్ అనుబంధ విస్తారిత వ్యవస్థలో బహుళభాషా సామర్థ్యాల్ని బలపరచడం, విశిష్ట రంగానికి సంబంధించి బలిష్ఠమైన పరిభాషను అభివృద్ధిపరచడం, భవిష్యత్తు అవసరాలను తీర్చగలిగే ఏఐ ఆధారిత వ్యవస్థల్ని తీర్చిదిద్దడం... భాషిణితో ఒప్పందం ఏర్పరుచుకోవడంలో ఉద్దేశాలు. వీటితో భాషాపరమైన పరిమితుల్ని అధిగమించి, పౌరులకు నిరంతర రాయ సహాయాన్ని అందించడానికి మార్గం సుగమం అవుతుంది."

ఆయుష్ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కవితా జైన్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఆరోగ్యసంరక్షణ సేవల లభ్యతను మెరుగుపరచడంలో బహుభాషా ఏఐ సాంకేతికతల పరివర్తనపూర్వక సామర్థ్యాన్ని వివరించారు. ఆమె "డిజిటల్ సాంకేతికతల ప్రయోజనాలను సద్వినియోగపరుచుకుంటూ లభ్యతలోనూ, సేవల అందజేతలోనూ సంస్కరణలను తీసుకురావడంపై ఆయుష్ శాఖ నిరంతర దృష్టిని కేంద్రీకరిస్తోంది. భాషిణి ద్వారా అందుబాటులోకి వచ్చిన బహుభాషా ఏఐ సొల్యూషన్లు.. ప్రత్యేకించి మందుల చీటీల్ని సిద్ధం చేయడంలో కీలక పాత్రను పోషించే డాక్టరు-రోగి సంభాషణ వ్యవస్థలతో పాటు క్షేత్రస్థాయిలో ఆరోగ్యసంరక్షణ సేవల లభ్యతను పటిష్ఠపరచడంలో సాంకేతికత ప్రధానమైన సామర్థ్యాలకు కూడా అద్దం పడతాయి. ఈ సహకారం మరింత సమ్మిళితమైన, పౌరుల ప్రయోజాలకు పెద్దపీటను వేసే డిజిటల్ ఆరోగ్యసంరక్షణ సేవల అనుబంధ విస్తారిత వ్యవస్థల దిశగా వేసిన ఒక కీలక అడుగు అని చెప్పవచ్చు" అని కూడా అన్నారు.

డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) శ్రీ అమితాభ్ నాగ్ మాట్లాడుతూ, "డిజిటల్ సార్వజనిక సేవలను అందరి చెంతకు చేర్చాలంటే అందుకు భాషా-సమ్మిళిత ఏఐ వ్యవస్థలు చాలా కీలకం. ఆయుష్ శాఖతో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుని బహుభాషా, స్వర ఆధారిత ఆరోగ్య సంరక్షక అనుబంధ వ్యవస్థల్ని ఏర్పరచాలన్నదే మా లక్ష్యం. ఆ వ్యవస్థలు పౌరులకు వారు మొగ్గు చూపే భాషలలో సహాయపడతాయి. అంతేకాదు, భారత్‌లో విస్తృత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దార్శనికతనూ బలోపేతం చేస్తాయి'' అని తెలిపారు.

ఆయుష్ గ్రిడ్ ఓఎస్‌డీ శ్రీ నమన్ గోయల్ మాట్లాడుతూ, యోగ పోర్టల్‌తో పాటు ఆయుష్ గ్రిడ్‌కు చెందిన మాస్టర్ పోర్టల్ 'ఎమ్ఏఐఎస్‌పీ' (ఓంమోఖ).. భాషిణి ప్లగ్ఇన్ ఏకీకరణను ఇప్పటికే పూర్తి చేసిందన్నారు. దీనికి దేశవ్యాప్త వినియోగదారుల దగ్గరి నుంచి వారి స్థానిక భాషల్లో ప్రోత్సాహకర ఫీడ్‌బ్యాక్ లభించినట్లు ఆయన వెల్లడించారు. ఎమ్ఓయూపై సంతకాలైన తరువాత, ఆయుష్ గ్రిడ్ ఇకోసిస్టమ్‌లో భాగంగా ఇక మీదట రాబోయే అన్ని పోర్టళ్లూ భాషిణితో జతపడతాయని, ఫలితంగా భాషతాలూకు ఇబ్బందులను అధిగమించి ఆయుష్ సేవలను దేశం నలుమూలలా అన్ని ప్రాంతాల వారి చెంతకు చేర్చవచ్చని శ్రీ గోయల్ వివరించారు.

ఆయుష్ డిజిటల్ వేదికల్లో భాషిణి అనువాద ఏపీఐ, వాక్కు-స్వర సాంకేతికతల ఏకీకరణకు మార్గాన్ని ఈ కార్యక్రమం సుగమం చేస్తుంది. దీనితో దేశంలో వేర్వేరు భాషా సీమలలో సౌలభ్యం, పౌరుల భాగస్వామ్యం మెరుగుపడనుంది. చర్చల్లో.. ఆరోగ్యసంరక్షణ రంగానికి చెందిన పారిభాషిక పదకోశం రూపకల్పన, రాబోయే కాలంలో బహుభాషా ఏఐ నమూనాను అభివృద్ధిపరిచేందుకు ఉద్దేశించిన ప్రమాణీకృత ఆయుష్ పరిభాషల కోసం భారత డిజిటల్ భండారం (రిపాజిటరి), 'నమస్తే' (ఔంఓయూఇ) పోర్టల్‌ల ప్రయోజనాలను వినియోగించుకొనేందుకు ఉన్న అవకాశాల్ని కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా, డిజిటల్ సేవల్ని మరింత మందికి అందుబాటులోకి తీసుకువెళ్లడానికి ఉద్దేశించిన అనేక పౌర ప్రధాన సేవల్ని గురించి డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ సోదాహరణంగా వివరించింది. కీలక డెమాన్‌స్ట్రేషన్లలో .. బహుభాషా స్పీచ్ ఇంటర్‌ఫేసులను ఉపయోగించి ఏఐ ఆధారిత డాక్టర్-పేషెంట్ ప్రిస్క్రిప్షన్ జనరేషన్ సిస్టమ్ ప్రక్రియ, 'శ్రుత్‌లేఖ్' మాధ్యమం ద్వారా సమావేశం కొనసాగుతుండగానే వివరాలను అప్పటికప్పుడు అక్షరబద్ధం (రియల్-టైం మీటింగ్ ట్రాన్స్‌క్రిప్షన్), సమావేశ నిర్ణయాల లేఖనం (మీటింగ్ మినట్స్ జనరేషన్), శ్రామిక వర్గానికి ఉపాధి కల్పనలో సాయపడేందుకు ఉద్దేశించిన స్వర-ఆధారిత సీవీ తయారీ సేవలతో పాటు, భారత ప్రాచీన చేతిరాత పుస్తకాలను డిజిటలీకరించి, సంరక్షించడంపై దృష్టి పెట్టిన భాషా సాంకేతిక ఉపకరణాలు వంటివి.. చోటుచేసుకున్నాయి.

దేశవ్యాప్తంగా సమ్మిళిత, సులభతర, పౌర ప్రయోజనాలకు ప్రాధాన్యాన్నిచ్చే ఆయుష్ ఇకోసిస్టమ్‌ను రూపొందించడానికి తాజాగా వృద్ధిలోకి వస్తున్న డిజిటల్ సాంకేతికతలు అందిస్తున్న ప్రయోజనాల్ని అందిపుచ్చుకొనే విషయంలో ఆయుష్ శాఖ కనబరుస్తున్న నిరంతర నిబద్ధతకు ఈ సహకారం అద్దం పడుతోంది.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.

అమరావతి, మే 15:ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే తొలిసారిగా పాణ్యం నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని, ఇది జిల్లా పరిపాలనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

మండల స్థాయిలోనే పరిష్కరించాల్సిన అనేక సమస్యలు జిల్లా స్థాయికి వస్తున్న నేపథ్యంలో ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రత్యేక వ్యవస్థను ప్రారంభించిందన్నారు. ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా స్థానికంగానే సమస్యలు వేగంగా పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు.

ఒకవేళ సమస్య పరిష్కారం అయ్యే అవకాశం లేకపోతే ఎందుకు సాధ్యం కాదో స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. "అధికారులు స్పందించడం లేదు", "అధికారులు అందుబాటులో లేరు" అనే ఫిర్యాదులు రాకుండా అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని సూచించారు.

సమస్య పరిష్కారం అవుతుందా లేదా, సాధ్యం కాకపోతే దానికి గల కారణాలను కూడా బాధ్యతగా వివరించాలని తెలిపారు. అలా చేయడం ద్వారా మధ్యవర్తుల చేత మోసపోయే ఘటనలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కరించగలమని, మరికొన్ని అంశాలు ఉన్నత స్థాయిలో పరిష్కారం కావాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

ముఖ్యంగా రహదారులు, వంతెనలు, భారీ వ్యయంతో కూడిన అభివృద్ధి పనుల వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపడమే లక్ష్యమని పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సోమవారం కలెక్టరేట్ , మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు.

అలాగే ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా జిల్లాలో తొలిసారిగా పాణ్యం నియోజకవర్గాన్ని ఎంపిక చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, "ఎన్ని సమస్యలు వచ్చాయి" అన్న దానికంటే "ఎన్ని సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యాయి" అన్న అంశంపైనే ప్రభుత్వం సమీక్ష చేస్తోందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో 70 నుంచి 75 శాతం సమస్యలు పరిష్కారం అయినప్పటికీ, మిగిలిన సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదని ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షిస్తున్నారని తెలిపారు.

పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో 300కు పైగా వినతిపత్రాలు అందాయని చెప్పారు. కాలనీలు, మురుగునీటి కాల్వలు, తాగునీరు, రహదారులు, పింఛన్లు, ఆదాయ శాఖ, ఆన్‌లైన్ నమోదు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు.

# గుంటూరు జిల్లాలో కలుషిత ఆహారం కారణంగా 50 మందికి అస్వస్థత

అమరావతి, మే 15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో కలుషిత ఆహారం కారణంగా పలువురు అస్వస్థతకు గురైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో ఓ కార్యక్రమంలో మిగిలిన బిర్యానీ తిన్న గ్రామస్థులు వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది. 13వ తేదీన జరిగిన కార్యక్ర మంలో మిగిలిపోయిన బిర్యానీని 14వ తేదీన గ్రామస్థులు తిన్నట్లు సమాచారం. అనంతరం రాత్రి నుంచి పలువురికి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. మొత్తం 50మందికి పైగా అస్వస్థతకు గురైనట్లు అధికారులు తెలిపారు.

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొలుసు పార్థసారథి



తిరుపతి, మే 15:రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం తిరుమలలో సాధారణ భక్తులకు కేటాయించే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ ద్వారా శ్రీవారిని దర్శించుకున్నారు.

సాధారణంగా రాష్ట్ర మంత్రులకు వీఐపీ బ్రేక్ దర్శనం సౌకర్యం ఉండే అవకాశం ఉన్నప్పటికీ, వేసవి రద్దీ దృష్ట్యా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని రకాల బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. దీంతో ప్రతిరోజూ మరింత ఎక్కువ సంఖ్యలో సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం లభిస్తోంది.

ఈ నేపథ్యంలో తన మనవరాలి కేశకండన కార్యక్రమం కోసం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చిన మంత్రి పార్థసారథి, సాధారణ భక్తుడిలా రూ.300 టికెట్ ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.

దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం టీటీడీ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆట వస్తువులను వెంటనే మరమ్మత్తులు చేయాలి..

తిరుపతి, మే 15: నగర పాలక సంస్థ పరిధిలోని వినాయక సాగర్ లో పాడైన ఆట వస్తువులను వెంటనే మరమ్మతులు చేసి పిల్లలకు అందుబాటులోకి తేవాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని రైతు బజార్, న్యూ మారుతి నగర్, రాయల్ నగర్, వినాయక సాగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఎల్.ఆర్. ఎస్. దరఖాస్తులను పరిశీలిం చారు. నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు.

ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వినాయక సాగర్ పరిశీలించి ఓపెన్ జిమ్, ఆట వస్తువులు మరమ్మత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ ను నిబంధనల మేరకు నిర్వహణ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మురుగునీటి శుద్ధి చేసే ప్లాంట్ ను మరింత బాగా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు.

# ఏక్తా యాత్ర నుంచి నేటిదాకా శ్రీ నరేంద్ర మోదీతో తన ప్రస్థానాన్ని 'అప్నాపన్'లో వివరించిన శివరాజ్ సింగ్ చౌహాన్



న్యూఢిల్లీ, మే 15: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో తన 35 ఏళ్ల సుదీర్ఘ అనుబంధాన్ని, అనుభవాలను వివరిస్తూ 'అప్నాపన్' పేరిట పుస్తకం రచించానని కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు ప్రకటించారు. ఈ మేరకు ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ- దశాబ్దాలపాటు సాగిన సంస్థాగత కార్యకలాపాలు, ప్రజా సేవ, పరిపాలన, దేశ ప్రగతి వంటి వివిధ అంశాలకు సంబంధించి ప్రధానమంత్రితో తన సన్నిహిత అనుబంధం, వ్యక్తిగత అనుభవాల సమాహారంగా ఈ పుస్తకాన్ని ఆయన అభివర్ణించారు. ఈ నెల 26వ తేదీన న్యూఢిల్లీలోని పూసాలోగల 'ఎన్ఏఎస్సీ' ప్రాంగణంలో ఉదయం 10:30 గంటలకు పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్య నాయుడు, పూర్వ ప్రధానమంత్రి శ్రీ హెచ్.డి.దేవెగౌడ సంయుక్తంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని ఆయన తెలిపారు.

ఈ పుస్తక పఠనం ద్వారా ప్రధానమంత్రి మోదీ వ్యక్తిత్వం, నాయకత్వ శైలి, అవగాహన, కార్యదక్షతల గురించి అత్యంత సామీప్య అనుభూతితో వ్యక్తిగత కోణంలో అర్థం చేసుకునే అవకాశం పాఠకులకు లభిస్తుందని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు.

సుదీర్ఘ ప్రజా జీవనంలో శ్రీ నరేంద్ర మోదీతో కలిసి పనిచేస్తున్న రోజుల్లో తనకు కలిగిన స్ఫూర్తి, అనుభవాలు, భావోద్వేగాలు, విలువలను ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని తెలిపారు. మూడున్నర దశాబ్దాల కిందట 1991 నాటి 'ఏక్తా యాత్ర'తో మొదలైన తమ అనుబంధం నేటివరకూ సుదీర్ఘంగా కొనసాగుతున్నదని ఆయన గుర్తుచేశారు. సంస్థాగతంగా కార్యకర్తల నడుమ ఏర్పడే ఒక సాధారణ పరిచయంతో మొదలైన సంబంధం ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా తాను నిర్వర్తించిన వివిధ బాధ్యతల ద్వారా కాలక్రమంలో ప్రగాఢ అనుబంధంగా పరిణతి చెందిందని వివరించారు. ప్రపంచం శ్రీ నరేంద్ర మోదీని ఒక నిర్ణయాత్మక, ప్రభావశీల నేతగా పరిగణిస్తుందని చెబుతూ- తనకు మాత్రం ఆయనలో ఓ "సాధకుడు, కర్మయోగి" దేశ ప్రయోజనాలకే తనను తాను అర్పించుకున్న మహోన్నత వ్యక్తిత్వం దర్శనమిస్తుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. రాత్రి బాగా పొద్దుపోయే వరకు అవిశ్రాంతంగా పనిచేసినా అలుపెరుగని ప్రధానమంత్రి మోదీ ప్రతి ఉదయాన్నీ అదే శక్తితో, స్పష్టతతో, మాతృభూమిపై అంకితభావంతో పునఃప్రారంభిస్తారని కొనియాడారు.

శ్రీ మోదీతో ఏక్తా యాత్ర నాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ- ఆ సమయంలో దాన్నొక రాజకీయ ప్రచారంగా కొందరు వ్యాఖ్యానించినప్పటికీ ప్రధానమంత్రి ఒక జాతీయ చైతన్య ఉద్యమంగా దాన్ని మలచారని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా శ్రీనగర్‌లోని లాల్ చౌక్‌లో త్రివర్ణ పతాకావిష్కరణతో శ్రీ మోదీ దార్శనికత ఆగిపోలేదని, యువతరంలో దేశభక్తిని ప్రతిష్టను, అంకితభావాన్ని రగిలించిందని చెప్పారు.

నాయకత్వమనేది ప్రసంగాలకు పరిమితం కాబోదంటూ- క్రమశిక్షణ, త్యాగం, నిబద్ధత, ప్రజలతో ప్రగాఢ అనుబంధ భావనతో అది మూర్తీభవిస్తుందనే వాస్తవాన్ని ఆ యాత్ర సందర్భంగానే తాను గ్రహించానని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఇలాంటి ఎన్నో అనుభవాలే ఈ పుస్తక రచనకు తనను పురికొల్పాయని ఆయన తెలిపారు.

ప్రధాని మోదీ కార్యదక్షతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ- సంస్థాగత విస్తరణ, ఎన్నికల వ్యూహరచన, ఆలోచనలను క్షేత్రస్థాయికి వర్తింపజేయడం, కార్యకర్తలతో మమేకం కావడం వంటి లక్షణాలు ఆయన శక్తిసామర్థ్యాలను స్పష్టంగా నిర్వచిస్తాయని చౌహాన్ అన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో సంక్లిష్ట, దీర్ఘకాలిక సమస్యలను చర్చలు, స్పష్టత, సంకల్ప బలంతో ఎలా పరిష్కరించవచ్చునో ప్రత్యక్షంగా చూశానని చెప్పారు.

ప్రధానమంత్రి శ్రీ మోదీ వ్యక్తిత్వం ఎంత దృఢమైనదో.. అంతే సున్నితమైనదని కేంద్ర మంత్రి అన్నారు. ఏక్తా యాత్ర నాటి ఓ సంఘటనను గుర్తుచేసుకుంటూ- పతాకావిష్కరణ సమయంలో భద్రత కారణాల వల్ల లాల్ చౌక్ వద్దకు చేరుకోలేక అంకిత భావంగల పలువురు కార్యకర్తలు నిస్పృహ చెందడంపై నరేంద్ర మోదీ ఆవేదన చెందారని తెలిపారు. ఆ క్షణంలో ప్రధానమంత్రి భావోద్వేగాన్ని, పార్టీ కార్యకర్తలతో ఆయనకుగల సన్నిహిత బంధాన్ని తాను అనుభూతి చెందానని శ్రీ చౌహాన్ అన్నారు.

సాధారణంగా నాయకత్వం సంస్థాగత దృఢత్వంతో మాత్రమే ముడిపడి ఉంటుందని ఆయన చెప్పారు. అయితే, శ్రీ నరేంద్ర మోదీకి కార్యకర్తలు, పేదలు, రైతులు, తల్లులు, అక్కచెల్లెళ్లు, చిట్టచివరి అంచెనగల ప్రతి ఒక్కరిపైనా ప్రగాఢ సహానుభూతి స్పష్టంగా కనిపిస్తుందని శ్రీ చౌహాన్ తెలిపారు. ప్రధానమంత్రి నాయకత్వ పటిమను విశిష్టమైనదిగా, దీర్ఘకాలిక ప్రభావం చూపగలదిగా నిలిపేది ఈ మానవతా దృక్పథమేనని పేర్కొన్నారు. సాంకేతికత ప్రాధాన్యాన్ని అనేకమంది నాయకులు, కార్యకర్తలు గుర్తించడానికి చాలా ముందుగానే ప్రధాని మోదీ పసిగట్టారని చెప్పారు. సుపరిపాలన, పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం, సేవల ప్రదానం తదితరాలతో సాంకేతికతను ఆయన ఎంత సమర్థంగా సంధానించారో ఆ తర్వాత దేశం ప్రత్యక్షంగా చూసిందని పేర్కొన్నారు.

ప్రపంచ మహమ్మారి కోవిడ్-19 సంక్షోభ కాలాన్ని ప్రస్తావిస్తూ- దేశవ్యాప్తంగా అనిశ్చితి, ఆందోళన నెలకొన్న వేళలోనూ తక్షణ నిర్ణయాలు తీసుకోవడంలోనూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఓర్పు, సంయమనం, దూరదృష్టి ప్రదర్శించారని చౌహాన్ గుర్తుచేశారు. ఇటువంటి సంక్షోభాలు నాయకత్వ పటిమకు కఠిన పరీక్ష పెడతాయని పేర్కొన్నారు. అంతటి సంక్లిష్ట సమయంలోనూ దేశానికి దిశానిర్దేశం చేయడంతోపాటు ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పారని తెలిపారు.

'అప్నాపన్' పుస్తక సారాంశాన్ని వివరిస్తూ- ఇది కేవలం సంఘటనలను గుదిగుచ్చిన రచన కాదని శ్రీ చౌహాన్ అన్నారు. దేశంలో మార్పును కాంక్షిస్తూ సాహసంతో కూడిన ఒక ఆలోచన, దార్శనికత, పని విధానం, దేశ పురోగమన స్ఫూర్తిని ప్రతిబింబించే పత్రంగా దీన్ని పరిగణించాలన్నారు. సంస్థాగత నిర్మాణం నుంచి పరిపాలన దాకా... అవగాహన నుంచి నిర్ణయాత్మకత వరకూ... సంకల్పం నుంచి సాకారం వైపు ప్రస్థానాన్ని పాఠకులు ఈ పుస్తక పఠనం అనుభూతి చెందగలరని ఆయన వ్యాఖ్యానించారు.

'అప్నాపన్' పాఠకులలో... ముఖ్యంగా యువతరంలో నవ్యోత్తేజం రగిలించగలదని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ విశ్వాసం వ్యక్తం చేశారు. రూపాంతరీకరణ దిశగా ఒక దేశాన్ని నడిపించాలంటే ఉన్నత పదవులేవీ అవసరం లేదంటూ- దృఢ సంకల్పం, క్రమశిక్షణ, సేవాభావం, ప్రజలతో హృదయానుగత బంధం ఉంటే చాలుననే సందేశాన్నిస్తుందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తిత్వాన్ని ప్రజలు సన్నిహితంగా అర్థం చేసుకునేలా తన వ్యక్తిగత అనుభవాలను పాఠకులకు పంచుకునే ప్రయత్నం చేశానని శ్రీ చౌహాన్ చెప్పారు. దేశంలో సామాజిక, రాజకీయ పరిణామ ప్రక్రియను అవగతం చేసుకోవాలని భావించే వారికీ ఈ పుస్తకం విలువైన పరిశోధన గ్రంథంగా ఉపయోగపడగలదని ఆయన వ్యాఖ్యానించారు.

# గోదావరిఖని బస్టాండ్ లో పోలీసుల విస్తృత తనిఖీలు

-గంజాయి మత్తుగార్థాల రవాణాపై నిఘా
-అనుమానితుల వివరాలు సేకరణ

కరీంనగర్, మే 15: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణ బస్టాండ్లో శుక్రవారం రోజున పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్ స్లీపర్ డాగ్స్ తో బస్టాండ్ లోని పరిసర ప్రాంతాలను సోదాలు చేశారు. బస్టాండ్లో అనుమానం కలిగిన ప్రతి ఒక్కరిని ప్రశ్నిస్తూ వివరాలు సేకరించడంతోపాటు వారి బ్యాగులను తనిఖీలు చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్ సమన్వయంతో నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

కార్గో పార్సిల్ కేంద్రాలు, దుకాణాలు, పాన్ షాపులతో పాటు పలు బస్సుల్లో కూడా తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గంజాయి సరఫరా, వినియోగాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌లతో కూడా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

తనిఖీలలో బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద ఉన్న బ్యాగ్ దగ్గరకు స్నిఫర్ డాగ్ వెళ్లి వాసన చూడడంతో అతడిని తనిఖీ చేయగా, బ్యాగ్‌లో పొగాకు (తంబాకు) ప్యాకెట్ లభించింది.

# రైతులు అధైర్య పడవద్దు..

-ప్రభుత్వం మొత్తం వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని హామీ
-కలెక్టర్ తో పలు సూచనలు
ప్రభుత్వ ప్రధాన సలహాదారు మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్, మే 15:నిజామాబాద్ జిల్లాలోని సొసైటీ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన సలహాదారు సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు పలు సూచనలు చేసి, ధాన్యం రవాణా ఆలస్యం కాకుండా ప్రత్యేకంగా లారీలను పంపించి రైస్ మిల్లులకు వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం మొత్తం వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి, ధాన్యం నిల్వ లేకుండా వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం సుమారు 7 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పటివరకు 5.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా సెంటర్లలో సుమారు 70 వేల క్వింటాళ్ల ధాన్యం మిగిలి ఉందని వెల్లడించారు. ఈ వారం రోజుల్లోనే అన్ని సెంటర్లలో కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సహకార చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, తహసిల్దార్ అనిరుద్, అమీనాపూర్ సర్పంచ్ సౌందర్య నవీన్, లక్కోర్ సర్పంచ్ అపర్ణ రాజు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన ఎన్డీఆర్ఎఫ్ ప్రెసిడెంట్స్ కలర్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, మే 15:ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) ప్రెసిడెంట్స్ కలర్ అవార్డు ప్రదానోత్సవానికి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్, ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్, పలువురు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ... ఎన్డీఆర్ఎఫ్‌కు ప్రెసిడెంట్స్ కలర్ అవార్డు బహూకరణ కేవలం వారి ప్రశంసనీయమైన సేవలకు గుర్తింపు మాత్రమే కాదని, ఎన్డీఆర్ఎఫ్‌లు, పంచాయతీల నుంచి రాష్ట్రాల వరకున్న మొత్తం వ్యవస్థ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సేవలో నిమగ్నమైన వేలాది మంది విపత్తు స్వచ్ఛంద సేవకుల కృషికి గౌరవ రాష్ట్రపతి ఇచ్చిన గుర్తింపు అని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది "ఆపద సేవా సదైవ సర్వత్ర" నినాదంతో దేశంలో ఎక్కడికైనా వెళ్లి సేవలందిస్తారని కొనియాడారు. భారతదేశంలో, విదేశాల్లోనూ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రజల ప్రేమను, నమ్మకాన్ని సంపాదించుకున్నారని శ్రీ అమిత్ షా అన్నారు. దేశంలో ఎక్కడ విపత్తు సంభవించినా, సంభవిస్తుందని భావించినా.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రాగానే సహాయక చర్యలు విజయవంతమవుతాయనే నమ్మకం ఇప్పుడు ప్రజల్లో కలుగుతోందని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ ఏర్పాటైనప్పటి నుంచి గత 20 ఏళ్లలో దేశవ్యాప్తంగా వరదలు, భూకంపాలు, తుఫాన్లు, ఇతర విపత్తుల సమయంలో విజయవంతమైన ఆపరేషన్ల ద్వారా 140 కోట్ల మంది పౌరుల నమ్మకాన్ని గెలుచుకుందని శ్రీ అమిత్ షా వెల్లడించారు. ఇప్పటివరకు 1.5 లక్షలకు పైగా ప్రజల ప్రాణాలను కాపాడి, 9 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని భద్రతా భావాన్ని, నమ్మకాన్ని పెంపొందిస్తున్నారని అన్నారు.

ప్రెసిడెంట్స్ కలర్ అవార్డు ప్రదానం మొత్తం ఎన్డీఆర్ఎఫ్ సేవ, ధైర్యం, పరాక్రమం, అంకితభావానికి దక్కిన గుర్తింపని కేంద్ర హోం మంత్రి అన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ), ఎన్డీఆర్ఎఫ్ విపత్తు నిర్వహణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో ప్రత్యేకంగా నిలబెట్టాయని, ఇది పౌరులందరికీ గర్వకారణమని, దేశ హోం మంత్రిగా ఆయనకు ప్రత్యేక గౌరవమని తెలిపారు.

2014 నుంచి భారత్ కేవలం విపత్తు ముప్పు తగ్గించేందుకు మాత్రమే కాక, అసలు ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకునే స్థాయికి చేరుకుందని కేంద్ర హోం మంత్రి అన్నారు. వాతావరణ శాఖ ముందస్తు సమాచారం అందించిన ప్రతిచోటా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించటమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఎన్డీఎంఏ ఎన్నో విధానపరమైన నిర్ణయాలు తీసుకుందని, మార్గదర్శకాలను జారీ చేసిందని, విపత్తు సన్నద్ధతను క్రమంగా జాతీయ సంస్కృతిగా మారుస్తూ ప్రజల్లో అవగాహనను పెంచిందని తెలిపారు. 8,500 మందికి పైగా సిబ్బందికి, 10,000 మందికి పైగా సివిల్ డిఫెన్స్ కార్మికులకు, 2.20 లక్షల మందికి పైగా వాలంటీర్లకు శిక్షణనిచ్చే బృహత్తర కార్యాన్ని ఎన్డీఆర్ఎఫ్ చేపట్టిందని వివరించారు. గత రెండేళ్లలో 10,500 మందికి పైగా పడవలు నడిపే వారికి కూడా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. 12 ఏళ్లలో విపత్తు సన్నద్ధత కేవలం ఒక వ్యవస్థ స్థాయి నుంచి ఒక సంపూర్ణ వ్యవస్థగా ఎదిగిందని చెప్పారు. గ్రామ పంచాయతీల నుంచి భారత ప్రభుత్వం వరకు, ఐఎండీ శాస్త్రవేత్తల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ ఒకే లక్ష్యం కోసం సమన్వయంతో పనిచేసే కొత్త సంస్కృతి ఆవిర్భవించిందని వెల్లడించారు. 16 బెటాలియన్లతో ఎన్డీఆర్ఎఫ్ శక్తిమంతమైన దళంగా ఎదిగిందని అన్నారు. ఎస్డీఆర్ఎఫ్‌లకు శిక్షణ ఇవ్వటం, ఉమ్మడి ఆపరేషన్ల ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బలాన్ని పెంపొందించుకుందని తెలిపారు. ముందస్తు మోహరింపు వంటి చర్యలు నష్టాన్ని తగ్గించటంలో ప్రభావవంతంగా పనిచేశాయని చెప్పారు. 2008లో బీహార్‌లో సంభవించిన కోసి వరదలు ఎన్డీఆర్ఎఫ్‌కు ఒక పెద్ద పరీక్షగా నిలిచాయని గుర్తుచేశారు. ఆ తర్వాత ధారాలిలో ఆకస్మిక వరదలు, చసోటిలో మేఘ విస్ఫోటనం, జమ్మూ, పంజాబ్, ఢిల్లీ వరదలు, మొంథా, దిత్వ వంటి తుపాను విపత్తులను ఎన్డీఆర్ఎఫ్ విజయవంతంగా ఎదుర్కొందని కొనియాడారు. అమర్‌నాథ్ యాత్ర, మహాకుంభ్, చార్‌ధామ్ యాత్ర, మణి మహేశ్ యాత్ర, శబరిమల యాత్ర, జగన్నాథ రథయాత్ర వంటి భారీ కార్యక్రమాల సమయంలోనూ సమాజంతో కలిసి ఎన్డీఆర్ఎఫ్ సమర్థవంతంగా పనిచేసిందని శ్రీ అమిత్ షా ప్రశంసించారు. 10 అంశాల అజెండా, 360-డిగ్రీల విధానం విపత్తు ముప్పు నిర్వహణకు నూతన దిశానిర్దేశం చేశాయని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఇది రిస్క్ మ్యాపింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సామాజిక భాగస్వామ్యం, మార్గదర్శకాల రూపకల్పన వంటి రంగాలను బలోపేతం చేసిందని చెప్పారు. అంతర్జాతీయంగా విపత్తు నిర్వహణలో భారతదేశం తిరుగులేని నాయకుడిగా, తొలి ప్రతిస్పందనదారుగా ఎదిగిందని శ్రీ అమిత్ షా అన్నారు. 'వసుధైవ కుటుంబకం' సూత్రాన్ని ఆచరణలోకి తెచ్చి క్షేత్రస్థాయిలో అమలు చేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తితో, విపత్తులను తట్టుకోగల మౌలిక సదుపాయాల రంగంలో భారతదేశం ప్రపంచ నాయకత్వాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. నేడు 48 దేశాలు 'కోయలిషన్ ఫర్ డిజాస్టర్ రెసిలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' (సీడీఆర్ఐ)లో చేరి భారత్‌తో కలిసి పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు. (సీఏపీఎఫ్‌లు) శ్రీ అమిత్ షా అభినందించారు. 2021 నుంచి సీఏపీఎఫ్ సిబ్బంది దేశవ్యాప్తంగా 7 కోట్లకు పైగా మొక్కలను నాటారని చెప్పారు. సీఏపీఎఫ్ దళాల్లోని మానవీయ దృక్పథాన్ని, పర్యావరణ స్పృహను ఇది ప్రతిబింబిస్తుందని కొనియాడారు.

# సంస్కరణలతో గత నాలుగు నెలల్లోనే రైల్వే ద్వారా సిమెంట్ రవాణా 170 శాతం వృద్ధి...

న్యూఢిల్లీ, మే 15:రైల్వే సంస్కరణలు చేపట్టిన గత నాలుగు నెలల్లోనే సిమెంట్ రవాణాలో 170 శాతం వృద్ధిని నమోదు చేసి భారతీయ రైల్వే గొప్ప విజయాన్ని సాధించింది. గతేడాది నవంబర్‌లో సిమెంట్ రవాణాకు సంబంధించి రైల్వేశాఖ ప్రవేశపెట్టిన వరుస సంస్కరణల వల్ల ఈ సానుకూల మార్పు వచ్చింది. ఈ సంస్కరణల్లో భాగంగా అంతరాయం లేకుండా సిమెంట్‌ను రవాణా చేసేందుకు 'ఇన్నోవేటివ్ బల్క్ సిమెంట్ ట్యాంక్ కంటైనర్ల'ను అందు బాటులోకి తీసుకువచ్చారు. కంటైనర్ రంగానికి సంబంధించిన సంస్కరణలు, అమలు తీరును ఇవాళ కేంద్ర రైల్వేశాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ సమీక్షించారు.

బల్క్ సిమెంట్ రవాణాలో రైల్వే వాటాను పెంచేందుకు, రోడ్డు రవాణా నుంచి స్వచ్ఛ, సమర్థవంతమైన రైల్వే రవాణాకు మారటాన్ని ప్రోత్సహించేందుకు ఈ సిమెంట్ సంస్కరణలను ప్రవేశపెట్టారు. సిమెంట్‌ను వివిధ రవాణా మార్గాల ద్వారా సులభంగా తరలించేందుకు వీలుగా ప్రత్యేకంగా రూపొందించిన ట్యాంక్ కంటైనర్లను, బల్క్ సిమెంట్ టెర్మినల్ విధానాన్ని రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది.

కొత్త విధానం వల్ల సిమెంట్ లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ సులభతరమైందని, రవాణాలో సరకు వృధా తగ్గిందని కేంద్రమంత్రి తెలిపారు. ఒకచోట తయారైన సిమెంట్‌ను ఇప్పుడు ప్రత్యేకమైన ట్యాంక్ కంటైనర్ల ద్వారా నేరుగా వినియోగ కేంద్రాలకు తరలించటం వల్ల పదేపదే లోడింగ్ చేయాల్సిన అవసరం తగ్గి, ఫ్యాక్టరీ నుంచి మార్కెట్‌కు సిమెంట్ వేగంగా చేరుతుందని చెప్పారు. ఈ కంటైనర్లు ప్రామాణిక పరిమాణంలో ఉండి, రెడీ-మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) యంత్రాలకు సరిపోయేలా ఉండటంతో నిర్మాణ స్థలాల్లో నేరుగా వినియోగించేందుకు సిద్ధంగా సిమెంట్ ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల రెండు రకాల హ్యాండ్లింగ్ దశలు తగ్గి, రవాణా ఖర్చులు ఆదా అవటమే కాక పనులు వేగంగా పూర్తవుతున్నట్లు వెల్లడించారు.

సిమెంట్ రవాణా రంగంలో మెరుగైన పనితీరు నిర్మాణ రంగంలో నిశ్శబ్ద విప్లవానికి నాంది పలుకుతోంది. సిమెంట్ తరలింపులో వివిధ దశలను తగ్గించటం, రవాణా ఖర్చులను ఆదా చేయటం ద్వారా వినియోగదారునికి చేరే సిమెంట్ ధర తగ్గే అవకాశముంది. ఇది నిర్మాణ సామగ్రి ఖర్చులను తగ్గించటంలో కీలక పాత్ర పోషిస్తుంది. నిర్మాణ వ్యయం తగ్గటం వల్ల ఇళ్ల నిర్మాణానికి డిమాండ్ పెరగడమే కాక.. పేద, మధ్యతరగతి వర్గాలకు గృహ నిర్మాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది.

వినూత్నమైన "మేక్ ఇన్ ఇండియా" ట్యాంక్ కంటైనర్లు రైలు నుంచి ట్రైలర్‌కు, తిరిగి ట్రైలర్ నుంచి రైలుకు సులభంగా మార్చుకునేలా రూపొందించారు. ఇవి సామాగ్రిని నేరుగా ఇంటి వద్దకు చేర్చే సమర్థవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తాయి. యంత్రాలతో లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు ప్రతి కంటైనర్ అనువుగా ఉంటుంది. సంప్రదాయ పద్ధతిలో బస్తాల ద్వారా జరిగే సిమెంట్ రవాణాతో పోలిస్తే... ఇవి సిమెంట్ వృధాను, ప్యాకేజింగ్ నష్టాలను గణనీయంగా తగ్గిస్తాయి.

లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో ఉత్పత్తయ్యే దుమ్ము గణనీయంగా తగ్గడం వల్ల ఈ సంస్కరణ పర్యావరణహితంగా మారిందని కేంద్రమంత్రి తెలిపారు. కంటైనర్ల ద్వారా బల్క్ రవాణా వైపు మళ్లటం వల్ల ఇంధన వినియోగం తగ్గటమే కాక, ఉద్గారాలు తగ్గి, స్వచ్ఛ రవాణాను ప్రోత్సహిస్తోంది. రహదారులపై రద్దీని కూడా తగ్గిస్తోంది.

సిమెంట్ రవాణాలో సాధించిన విజయం తర్వాత ఫ్లై యాష్ రవాణాలోనూ అటువంటి సంస్కరణలనే చేపట్టేందుకు రైల్వే శాఖ కృషి చేస్తోంది. ఈ అంశంపై సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించిన శ్రీ అశ్వినీ వైష్ణవ్, ఫ్లై యాష్ రవాణా మార్కెట్లో ఉన్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నుంచి వెలువడే వ్యర్థాలను జాతీయ సంపదగా మార్చాలని సూచించారు.

దేశంలో దాదాపు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల ఫ్లై యాష్ ఉత్పత్తి అవుతోందని, అందులో కేవలం 13 మిలియన్ టన్నులు మాత్రమే రైల్వే ద్వారా రవాణా చేస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఇటుక బట్టీలు, సిమెంట్ పరిశ్రమలు, నిర్మాణ ప్రాంతాలకు ఫ్లై యాష్ రవాణాను సులభతరం చేయాలని, ఇందులో రైల్వే వాటాను గణనీయంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. "వ్యర్థాల నుంచి సంపద" సృష్టించే అవకాశంగా కేంద్రమంత్రి దీన్ని అభివర్ణించారు. విద్యుత్ ప్లాంట్లు వ్యర్థంగా భావించే ఫ్లై యాష్.. రహదారుల నిర్మాణం, సిమెంట్ తయారీ, ఇటుకల ఉత్పత్తికి విలువైన వనరు అని తెలిపారు.

ఫ్లై యాష్ వినియోగాన్ని, రవాణాను విస్తృతం చేయటం వల్ల కాలుష్యం తగ్గటంతో పాటు పారిశ్రామిక వ్యర్థాల పునర్వినియోగం పెరుగుతుంది. ఇటుకలు, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రి తయారీ ఖర్చు కూడా తగ్గుతుంది. దీన్ని నిర్మాణ రంగంలో వినియోగించటం ద్వారా పర్యావరణహిత, సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడుతుంది.

వినూత్నమైన కంటైనర్ వ్యాగన్లు, భారతీయ రైల్వేలో సమర్థవంతమైన, తక్కువ ఖర్చుతో, పెద్ద ఎత్తున సరకు రవాణా కోసం సిమెంట్ రవాణాలో చేపట్టిన సంస్కరణలు కీలక ముందడుగా నిలిచాయి. ఈ జోరుతోనే ఇప్పుడు ఫ్లై యాష్ రవాణాపై దృష్టి సారించడం ద్వారా "వ్యర్థాల నుంచి సంపద" విధానం మరింత బలోపేతం కానుంది. కీలకమైన మౌలిక సదుపాయాల రంగాల్లో పర్యావరణహిత సరకు రవాణా వ్యవస్థను విస్తరించేందుకు ఇది దోహదపడుతుంది.

# తరుగు పేరుతో ధాన్యం రైతులు నిలువు దోపిడి..

-సిపిఐ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

భద్రాద్రి కొత్తగూడెం జిలా మే 15:ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులను నిలువ దోపిడి చేస్తున్నారని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని ఆర్కే గార్డెన్స్ లో సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వల్లమల్ల సామేల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలకు ఐదు కేజీలను తరుగు తీస్తున్నారని ఆరోపించారు. తరుగు పేరుతో అడ్డగోలుగా కోత విధిస్తున్నారన్నారు.

తరుగు తీసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో జమా చేయాలని ప్రభుత్వాన్ని సాబీర్ పాషా డిమాండ్ చేశారు. రైతుల ఖాతాల్లో జమ చేయాలి రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు వస్తున్న రైతులను నిలువునా మోసం చేయడం అన్యాయమన్నారు. తరుగు పేరుతో రైతులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడిన టార్పాలిన్లు, గిడ్డంగి సౌకర్యం, తాగునీరు, కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమయిందని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని సాబీర్ పాషా విమర్శించారు.

ఈ సమావేశంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, యల్లంకి మధు, యాస రోశయ్య, తూము కోటయ్య, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, కంచర్ల రాఘవేంద్ర రావు, సిరిపురపు వెంకటేశ్వర్లు, కొండ వీరయ్య, చిమట ముత్తయ్య, పాలెపు ప్రభాకర్, పాల్గొన్నారు.


# కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్

మానవ స్వరాన్ని ప్రపంచ దూరాలకు శబ్దంగా పరిచయం చేసిన సంఘటన విజ్ఞాన చరిత్రలో ఓ మైలురాయి. ఈ శబ్ద విప్లవానికి మార్గం వేసిన ఆవిష్కరణ మైక్రోఫోన్. శబ్దాన్ని విద్యుత్ సంకేతాలుగా మార్చే ఈ అద్భుత పరికరాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన విజ్ఞాన శిల్పి డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్. ఆయన కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త. పేటెంట్ హక్కుల ఊహలకు అతీతంగా, పరిశ్రమలకు తన ఆవిష్కరణలు ఉచితంగా అందించాలన్న ఉదారత ఆయనను విశ్వ విజ్ఞాన మాధ్యమాల్లో చిరస్మరణీయుడిగా నిలిపింది.

1831 మే 16న బ్రిటన్‌లో జన్మించిన డేవిడ్ హ్యూస్ చిన్ననాటి నుంచే సంగీతంపై మక్కువ చూపించాడు. పియానో, మాండలిన్ వాయిద్యాల్లో ప్రావీణ్యం సాధించిన అతను, శబ్ద తరంగాల స్వభావంపై ఆసక్తితో శాస్త్రీయ అధ్యయనానికి పయనమయ్యాడు. 1838లో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లిన హ్యూస్, కెంటుకీలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో సంగీత ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాడు. అయితే సంగీతంలోని శబ్దతత్వం ఆయనను ఎలక్ట్రిక్ విజ్ఞాన ప్రక్రియల వైపు ఆకర్షించింది.

1855లో అభివృద్ధి చేసిన టైప్-ప్రింటింగ్ టెలిగ్రాఫ్ పరికరం హ్యూస్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. టెలిగ్రాఫ్ ద్వారా వచ్చిన సంకేతాలను తక్షణవే అక్షరాలుగా ముద్రించ గలిగే ఈ పరికరం కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు కారణమైంది. ఇది ఫ్రాన్స్, ఇటలీ, రష్యా వంటి దేశాలలో అధికారికంగా ఉపయోగించ బడింది.

1878లో హ్యూస్ రూపొందించిన కార్బన్ మైక్రోఫోన్ ఆధునిక టెలిఫోన్ వ్యవస్థకు మౌలిక పునాదిగా నిలిచింది. శబ్ద తరంగాలను విద్యుత్ ప్రవాహ మార్పులుగా మార్చే ఈ పరికరం, మానవ స్వరాన్ని కిలోమీటర్ల దూరానికి పంపించ గలిగే సామర్థ్యం కలిగింది. ఆసక్తికరమైనది ఏమంటే, హ్యూస్ తన మైక్రోఫోన్ ఆవిష్కరణకు పేటెంట్ దాఖలు చేయలేదు. శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యక్తిగత లాభానికి ఉపయోగించకుండా, సమాజానికి అందించిన ఉదారత ఆయన గొప్పతనానికి నిదర్శనం.



మే 16...డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్ జయంతి

వైర్‌లెస్ కమ్యూనికేషన్ పై కూడా హ్యూస్ విశేష ప్రయోగాలు నిర్వహించాడు. 1879లో 500 గజాల దూరానికి వైర్‌లెస్ సంకేతాలను ప్రసారం చేయగలిగిన ఆయన, హర్ట్జ్, మార్కోని కంటే ముందే రేడియో తరంగాలను ప్రయోగాత్మకంగా అన్వేషించాడు. కానీ, ఈ పరిశోధనలకు తగినంత శాస్త్రీయ ప్రామాణికత అందలేదన్న కారణంతో, ఆ కీర్తి ఆయనకు దక్కలేదు. అయినా ఆయన అభివృద్ధి చేసిన ఇండక్షన్ బ్యాలెన్స్ పరికరం ఆధారంగా భవిష్యత్తులో మెటల్ డిటెక్టర్లు రూపొందించ బడ్డాయి.

తన ఆవిష్కరణలకు గుర్తింపుగా హ్యూస్ 1880లో బ్రిటన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యాడు. 1885లో రాయల్ మెడల్‌తో సత్కరించ బడ్డాడు. ఫ్రాంక్లిన్ ఇనిస్టిట్యూట్ సహా అనేక అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థల నుంచి గౌరవాలు అందుకున్నాడు. అయినప్పటికీ, శాస్త్రానికి సేవ చేయాలన్న లక్ష్యం ఒక్కటే ఆయన్ని నడిపించింది.

1900 జనవరి 22న హ్యూస్ లండన్‌లో పరమ పదించాడు. ఆయన సాధించిన విజ్ఞాన పునాదులు టెలి కమ్యూనికేషన్, రేడియో, టెలివిజన్, మైక్రోఫోన్, డిజిటల్ ఆడియో వ్యవస్థల్లో నేటికీ ప్రాణంగా కొనసాగు తున్నాయి. శబ్దాన్ని విద్యుత్ భాషలో మార్చిన ఆయన సృష్టి, మానవ సంభాషణలకి సుదూర సంబంధాలే కాదు ? సమాజానికి శాశ్వతమైన శబ్ద సంబంధాన్ని అందించిందని చెప్పడంలో సందేహమే లేదు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# మండు టెండలో... వినోదాలు



వేసవి సెలవులో పిల్లలను సాంస్కృతిక కళలలో ప్రదర్శనలు ఇచ్చేలా ప్రోత్సహిస్తూ,మన సంస్కృతిని ముందు తరాల వారికి తెలిసేలా చేస్తున్న శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యా రాణిని ముఖ్య అతిథిగా విచ్చేసిన పూర్వ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. చెడు వ్యసనాలకు బానిసలవ ుతున్న నేటి యువత, ఇటువంటి కళల పై దృష్టి పెట్టినట్లు అవుతే ,ముందు ముందు ఎందరో కళా కారులు పుట్టుకొస్తారని అన్నారు. భారత దేశం కళలకు ఎంతో ప్రసిద్ధి అని ,మన కళలను విదేశీయులు ఎంతో గౌరవం ఇస్తారని,కళల ద్వారా వ్యక్తిత్వం కూడా వికశిసుందని,జ్ఞానం ఎంతో ఉన్నప్పటికీ,జ్ఞానానికి,వ్యక్తిత్వ వికాసానికి ఎంతో భేదం ఉందని అన్నారు. దేశం కోసం,సమాజం కోసం పని చేయాలని,ఒక మంచి సమాజ నిర్మాణం కొరకు కృషి చేయాలని అన్నారుతెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ,శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, వేసవి వినోదాలు పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహి ంచారు.లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్ర మంలో ప్రజ్ఞ,హసినీల కూచిపూడి నృత్య ప్రదర్శన,వేణు గీతిక ,మూర్తి,ఐఐ ,మోహన్ కృష్ణఆల హాస్య వల్లరి, అభిరామ్, లాస్య,నూతలపటి ప్రభాకర్, రాధ రాణి, పద్మావతి, పాటల కార్యక్రమం బుధవారం సాయంత్రం 13.6. 26 సా: రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరిగింది. ముఖ్య అతిథిగా పూర్వ గవర్నరువిచ్చేసి ,హాజరై కళాకారులను సత్కరించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ అవకాశం,అభిరుచి కల్పిస్తే ప్రతి ఒక్కరూ తమ తమ కళలలో రాణిస్తారని ,తల్లిదండ్రుల ప్రోత్సాహం అందుకు ప్రధాన కారణమై, పిల్లలు నృత్య సంగీత,సాహిత్యాలలో సాధికారతను సాధిస్తారని ,తద్వారా మన సంస్కృతి వెల్మ్రవిరుస్తుందని అన్నారు . డా.జయంతి రెడ్డి మాట్లాడుతూ వేణుగీతిక ,మోహన్ కృష్ణ వేసిన హాస్య వల్లరి చాలా అద్భుతంగా ఉందని , పాత పాటలతో మనసుకు ఆహ్లాదాన్నీ ఇచ్చిందని,ఇటువంటి మంచి కార్యక్రమము నిర్వహించిన సంస్థ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి కి అభినందనలు తెలియ చేశారు.బుర్రా మోహన కృష్ణ వ్యాఖ్యానం,ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది.మోహన కృష్ణ , మూర్తి,వేణు గీతికల హాస్య వల్లరితో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించారని,హాస్యమే నేట జీవన స్రవంతిలో పరమ ఔషధమని వక్తలు కొనియాడారు .లేఖ్య,ప్రీతి ,రవి శంకర్ ఠాగూర్, అభిరామ్,రాధ రాణి,పద్మావతి,నూకల ప్రభాకర్ల తమ పాటలతో ప్రేక్షకులను అలరించారని వక్తలు కొనియా డారు. తత్వ అకాడమీకి కృతజ్ఞత లు తెలియచేస్తూ, తమ సంస్థను ఎంతో ప్రోత్సహిస్తున్నరని శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీమతి పాలపర్తి సంధ్యారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో ఒ.జయంతి రెడ్డి, రఘుశ్రీ,పాల్గొన్నారు.

# భారత పారిశ్రామిక చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం

న్యూఢిల్లీ, మే 15: భారత్ నేడు కేవలం ఒక వినియోగదారు దేశం మాత్రమే కాదు.. ప్రపంచానికి సాంకేతికతను ఎగుమతి చేసే దిగ్గజంగా అవతరిస్తోంది. అంతరిక్షం నుంచి రక్షణ రంగం వరకు భారత్ సాధిస్తున్న విజయాలు అగ్రదేశాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఒకప్పుడు విమానాలు, క్షిపణుల కోసం విదేశాల వైపు చూసిన మనం.. నేడు 'మేక్ ఇన్ ఇండియా' మంత్రంతో ప్రపంచ విమానయాన చిత్రపటాన్ని మార్చేస్తున్నాం. తాజాగా గుజరాత్‌లోని వడోదర నుంచి బయటకు వచ్చిన తొలి స్వదేశీ సి-295 రవాణా విమానం భారత పారిశ్రామిక చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం.

ఆత్మనిర్భర్ దిశగా ఏరోస్పేస్ విప్లవం భారత రక్షణ రంగం గత దశాబ్ద కాలంగా అద్భుతమైన ప్రగతిని సాధిస్తోంది. తేజస్ యుద్ధ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా వార్తల్లో నిలిచిన బ్రహ్మోస్ క్షిపణులు దేశీయ సాంకేతిక సత్తాను చాటిచెప్పాయి. అయితే రవాణా విమానాల తయారీలో మాత్రం ఇప్పటి వరకు ఒక లోటు ఉండేది. ఆ లోటును భర్తీ చేస్తూ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ భాగస్వామ్యంతో వడోదరలో ఏర్పాటు చేసిన ప్లాంట్ ఇప్పుడు రికార్డు సమయంలో విమానాన్ని సిద్ధం చేసింది. 2024లో ప్రధాని నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్, కేవలం రెండేళ్ల వ్యవధిలోనే తొలి విమానాన్ని పట్టాలెక్కించడం భారత పారిశ్రామిక వేగానికి నిదర్శనం.

సి-295: ప్రత్యేకతలు

స్వదేశీ ముద్ర భారత వాయుసేన (ఐఏఎఫ్) అవసరాల కోసం మొత్తం 56 విమానాల ఒప్పందం కుదరగా అందులో 40 విమానాలు పూర్తిగా వడోదరలోనే తయారుకానున్నాయి. ఈ విమానం విశేషాలు పరిశీలిస్తే ఈ తొలి విమానంలో వాడిన విడిభాగాల్లో దాదాపు 70 శాతం భారత్‌లోనే తయారయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న 37 చిన్న, మధ్య తరహా కంపెనీలు తయారు చేసిన 13,000లకు పైగా విడిభాగాలను ఈ విమాన నిర్మాణంలో ఉపయోగించారు. ఇది కేవలం సైనిక సామాగ్రిని తరలించడానికే కాకుండా, విపత్తుల సమయంలో సహాయక చర్యలకు, పారాట్రూపర్ల తరలింపునకు అత్యంత అనుకూలమైనది.

### ఏరో హబ్‌లుగా ఏపీ, తెలంగాణ

రాష్ట్రాల చొరవ కేవలం ప్రభుత్వ సంస్థలే కాకుండా ప్రైవేట్ రంగం కూడా ఏరోస్పేస్‌లో దూసుకుపోతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్‌తో ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఊపిరి పోసింది. మరోవైపు తెలుగు రాష్ట్రాలు ఏరోస్పేస్ హబ్‌లుగా మారుతున్నాయి. తిరుపతి జిల్లాను ఏరోస్పేస్ హబ్‌గా.. కడపను డ్రోన్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌లో ఇప్పటికే 'డ్రోన్ టాక్సీ' నమూనా సిద్ధమైంది. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెడుతూ వచ్చే ఏడాది నాటికి ఇవి ఆకాశంలో ఎగిరే అవకాశం ఉంది.

### గ్లోబల్ హబ్‌గా భారత్

సి-295 విమానం తయారీ అనేది కేవలం ఒక రక్షణ ప్రాజెక్ట్ మాత్రమే కాదు.. ఇది కోట్లాది మంది భారతీయుల ఆత్మవిశ్వాసానికి ప్రతీక. పూర్తిస్థాయి దేశీయ పరిజ్ఞానంతో పౌర విమానాలు తయారు చేసే దిశగా ఇది తొలి మెట్టు. రాబోయే రోజుల్లో 'బోయింగ్', 'ఎయిర్‌బస్' వంటి అంతర్జాతీయ విమాన యాన సంస్థలు తమ ప్రధాన తయారీ కేంద్రాలను భారత్‌కు మార్చక తప్పని పరిస్థితిని మన ఇంజనీర్లు కల్పిస్తున్నారు. భారత్ ఇప్పుడు ఆకాశంలో తన ముద్రను సుస్థిరం చేసుకుంది. రేపటి తరం భారత్ తయారు చేసిన విమానాల్లో ప్రయాణించడమే కాకుండా ప్రపంచ విమానయాన రంగానికి దిక్సూచిగా నిలవబోతోంది.

# సంస్థ లక్ష్యాల సాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలి : జీఎం శాలెం రాజు

ఖమ్మం, మే 15: సింగరేణి సంస్థ భవిష్యత్ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పని చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు పిలుపునిచ్చారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ ప్రణాళికలు, సవాళ్లపై వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ పలు విభాగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, భద్రత, యంత్రాల వినియోగంలో మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. 2026-27 సంవత్సరానికి 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దీనిని సాధించేందుకు అన్ని ఏరియాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.భూగర్భ గనుల్లో ఆధునిక యంత్రాల వినియోగాన్ని మరింత పెంచుతున్నామని, ఉపరితల గనుల్లో భారీ యంత్రాల వినియోగంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పనితీరు మెరుగుపడటంతో పాటు కార్మికుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం బొగ్గు నాణ్యత, మార్కెటింగ్ రంగాల్లో పోటీ మరియు పర్యావరణ పరిమితులు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొనే దిశగా సంస్థ ముందుకు సాగుతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.కంపెనీ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వ్యయ నియంత్రణతో పాటు ఆదాయ వనరులను పెంచే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో గ్రీన్ ఎనర్జీ, సోలార్ ప్రాజెక్టులు, ఆధునిక మైనింగ్ టెక్నాలజీపై సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. సింగరేణిలో మహిళా ఉద్యోగుల పాత్ర రోజురోజుకు పెరుగుతోందని, వారికి సురక్షితమైన పని వాతావరణం, ప్రత్యేక సంక్షేమ చర్యలు, శిక్షణ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి బలమని పేర్కొంటూ వైద్య సేవలు, విద్య, గృహ వసతి, తాగునీరు, క్రీడలు, ఉద్యోగుల పిల్లలకు విద్యా సహాయం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలంటే ప్రతి ఉద్యోగి సమయపాలన, హాజరు, భద్రతా నిబంధనల పాటిస్తూ, ఉత్పాదకత పెంపుపై దృష్టి పెట్టాలని జీఎం సూచించారు. సంస్థ అభివృద్ధి చెందితేనే ఉద్యోగుల భవిష్యత్ మరింత భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్ (ఓఊ) ద్వారా కొత్తగూడెం ఏరియాలోని గనులు, విభాగాల్లో ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంస్థ పనితీరు, భవిష్యత్ లక్ష్యాలు, సవాళ్లు, సంక్షేమ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించనున్నట్లు చెప్పారు.

# 'భరోసే కా అడ్రస్'గా 50 కొత్త ఏజెన్సీ కార్యాలయాలు యాక్సిస్ మ్యాక్స్ లైఫ్

హైదరాబాద్, మే 15:గతంలో మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌గా ప్రసిద్ధి చెందిన యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తన పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించే భాగంగా టియర్-2 టియర్-3 మార్కెట్లలో 50 కొత్త ఏజెన్సీ కార్యాలయాలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో ఈ కార్యాలయాలను ప్రారంభించగా, న్యూ ఢిల్లీ-ఎన్‌సీఆర్ బెంగళూరులోనూ తమ ఉనికిని మరింత బలోపేతం చేసింది.ఈ కార్యక్రమం ఐఆర్‌డీఏఐ యొక్క '2047 నాటికి ప్రతి ఒక్కరికి బీమా' లక్ష్య సాధనకు ఊతమివ్వడమే కాకుండా, జీవిత బీమాను కేవలం "ప్రచారం ద్వారా అమ్మే ఉత్పత్తి"గా కాకుండా, గ్రామీణ స్థాయిలో అవసరమైన భద్రతా సాధనంగా మలచే దిశగా ముందుకు తీసుకెళ్తోంది. యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుమిత్ మదన్ మాట్లాడుతూ, "భారతదేశంలోని ప్రతి మూలకు ఆర్థిక రక్షణ చేరుకోవాలని మా కట్టుబాటు. ముఖ్యంగా సేవలు అందని ప్రాంతాల్లో ప్రత్యక్ష ఉనికిని ఏర్పాటు చేయడం ద్వారా ఇది ప్రారంభమవుతుంది. 'భరోసే కా అడ్రస్'ను నిర్మిస్తున్నాం. బీమా సేవలకే పరిమితం కాకుండా, 'భరోసే కా అడ్రస్' కార్యాలయాలు స్థానిక సమాజాలకు విస్తృత ఉపాధి అవకాశాలను కూడా కల్పించనున్నాయి. ప్రతి శాఖలో నియామకాలు శిక్షణకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం అమలులో ఉంటుంది.స్థానిక సంస్కృతికి దగ్గరగా ఉండే ఆర్థిక సలహాలను అందించనున్నారు.ఈ విస్తరణ ఆర్థిక 26లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచినప్పటికీ, 'భరోసే కా అడ్రస్' భారతదేశ భద్రతా వ్యవస్థపై యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ యొక్క దీర్ఘకాలిక కట్టుబాటును సూచిస్తుంది. ఈ విస్తరణ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, నాణ్యమైన భద్రతా పరిష్కారాలను నిరంతరం అందించే బలమైన ఏజెన్సీ నెట్‌వర్క్ నిర్మాణానికి పునాది వంటిదిగా నిలవనుంది.

# భారతీయ మార్కెట్లోకి దేశపు మొట్టమొదటి 'సిలికేట్ మినరల్ పెయింట్ టెక్నాలజీ'ని విడుదల చేసిన జైడెక్స్ పెయింట్స్

హైదరాబాద్, మే 15:వర్షాకాలంలో భారతీయ భవనాలు గోడలకు చెమ్మ పట్టడం, పెయింట్ పెచ్చులుగా ఊడిపోవడం, నాచు పట్టడం మరియు ఉపరితలం పాడవడం వంటి సాధారణ సమస్యలను ఎదుర్కొంటాయి. ఇంటి యజమానులు మరియు నిర్మాణ రంగ నిపుణులు ఎదుర్కొంటున్న ఈ సవాళ్లకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని అందించడానికి, జైడెక్స్ పెయింట్స్ (జిఎటవలీ ఖజీతినిబిబ) భారతదేశపు మొట్టమొదటి 'సిలికేట్ మినరల్ పెయింట్ టెక్నాలజీ' (రాతిశ్రీతిఇజీబివ ఓతినివతీజీశ్రీ ఖజీతినిబి ంవఇష్ట్రనినీశ్రీనీణం) ని ప్రవేశపెట్టింది. ఇది భవనాలను తేమ వల్ల కలిగే నష్టం నుండి రక్షించే, గాలి ఆడే (ఎతీవజీబిష్ట్రజీఎశ్రీవ) మరియు మన్నికైన వ్యవస్థ.జైడెక్స్ యొక్క సిలికేట్ మినరల్ పెయింట్ గోడ ఉపరితలంతో రసాయనికంగా బంధించబడుతుంది. ఈ సాంకేతికత లోపల చిక్కుకున్న ఆవిరిని బయటకు వెళ్లనిస్తుంది, తద్వారా చెమ్మ మరియు పెచ్చులు ఊడిపోవడం వంటి సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. రంగు వెలిసిపోవడం, పెచ్చులు ఊడిపోవడం మరియు మురికి పేరుకుపోవడాన్ని నివారించే, భారతీయ వాతావరణానికి అనువైన ఎక్స్‌టీరియర్ మరియు ఇంటీరియర్ పెయింట్‌లను కంపెనీ ప్రవేశపెట్టింది.కంపెనీ వ్యూహాత్మక దిశపై స్పందిస్తూ, జైడెక్స్ గ్రూప్ చైర్మన్ మరియు ఎండి, డాక్టర్ అజయ్ రాంకా మాట్లాడుతూ, "భారతదేశ నిర్మాణ రంగం ఇప్పుడు మన్నిక, స్థిరత్వం మరియు దీర్ఘకాలిక రక్షణను అందించే పదార్థాల వైపు మళ్లుతోంది. జైడెక్స్‌లో, సిలికేట్ మినరల్ పెయింట్ టెక్నాలజీని భారతీయ భవనాలకు మరింత అందుబాటులోకి మరియు అనుకూలంగా మార్చడంపై మేము దృష్టి సారించాము. వినియోగదారుల నుండి లభిస్తున్న బలమైన ఆదరణతో, ఈ విభాగాన్ని మరింత విస్తరించడానికి మేము గణనీయమైన అవకాశాలను చూస్తున్నాము. ఈ సాంకేతికత-ఆధారిత విధానానికి మార్కెట్లో అద్భుతమైన ఆదరణ లభించింది, దీనితో జైడెక్స్ పెయింట్స్ కొనుగోళ్లు పదేపదే జరుగుతున్నాయి మరియు బిల్డర్లు, ఆర్కిటెక్ట్‌ల మధ్య ఆసక్తి పెరుగుతోంది."ఈ సాంకేతిక విధానాన్ని మరింత వివరిస్తూ, జైడెక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మౌలిక్ రాంకా ఇలా అన్నారు,




"నిర్మాణ రంగంలోని వాస్తవ సవాళ్లను పరిష్కరించడంపైనే మా పరిశోధన మరియు అభివృద్ధి (ఖీడఆ) ప్రధానంగా దృష్టి సారించింది. సిలికేట్ మినరల్ పెయింట్ టెక్నాలజీ గోడ ఉపరితలంతో బంధించబడి, దానికి గాలి ఆడేలా చేయడం ద్వారా పూర్తిగా భిన్నమైన యంత్రాంగాన్ని అందిస్తుంది. తేమ వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో ఇది చాలా కీలకం. నిర్మాణాల్లోకి నీరు చొరబడకుండా మరియు వాతావరణం వల్ల కలిగే నష్టం నుండి కాపాడడం ద్వారా మా వాటర్‌ప్రూఫింగ్ ఇన్నోవేషన్‌లు ఈ విధానాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఈ ఆవిష్కరణల స్ఫూర్తితో, మేము ఏటా 50% వృద్ధిని అంచనా వేస్తున్నాము, ఇది వచ్చే ఏడాది మా టర్నోవర్‌ను రెట్టింపు చేయడానికి మార్గం సుగమం చేస్తుంది.''?93,000 కోట్ల భారతీయ పెయింట్ మార్కెట్‌లో, ఇప్పుడు వినియోగదారుల డిమాండ్ కేవలం అలంకార (డెకరేటివ్) కోటింగ్‌లకే పరిమితం కాకుండా, మన్నికైన మరియు పనితీరు-ఆధారిత పరిష్కారాల వైపు కదులుతోంది. ఒకవేళ ఐరోపా మార్కెట్ల మాదిరిగానే భారతదేశంలోనూ డిమాండ్ పెరిగితే, ఈ సాంకేతికత ?2,000 కోట్ల సంభావ్య విభాగంగా (సెగ్మెంట్‌గా) మారే అవకాశం ఉంది.

# జనగణనలో ప్రతి కుటుంబం పాల్గొనాలి : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, మే 15:భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనగణన 2027 కార్య క్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని తమ కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎస్పీ స్వయంగా జనగణన స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని శుక్రవారం కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ అధికారులుగా గుర్తింపు కార్డులతో వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి జనగణన విజయవంతానికి తోడ్పడాలని కోరారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికకు కీలక ఆధారమని, భవిష్యత్ సంక్షేమ శపథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి అంశాల ప్రణాళిక రూపకల్పనలో జనగణన గణాంకాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర సమాచారం జనగణన ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అందించే వ్యక్తిగత సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందవి. ఆ వివరాలను ఇతర ప్రయోజనాల కోసం వినియోగించడం జరగదని స్పష్టం చేశారు. ఎటువంటి సందేహాలు లేకుండా నిజమైన సమాచారాన్ని నమోదు చేయాలని కోరారు. తప్పుడు సమాచారం ఇద్వడం వల్ల ప్రభుత్వ ప్రణాళికల అమలుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే జనగణన పేరుతో మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇంటి వద్దకు వచ్చే అధికారిక ఎన్యూమరేటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం వివరాలు, ఓటీపీలు లేదా పాస్ వర్డ్ లు అడగరని తెలిపారు. అలాంటి వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు.

# అఖిల భారత పోలీస్ క్రీడల్లో ఏసీపీ మాధవి మెరుపు

## - నాలుగు పతకాలు సాధించి కరీంనగర్‌కు కీర్తి



కరీంనగర్, మే 15: ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈనెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ ఏసీపీ వి.మాధవి ప్రతిభ చాటారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో మొత్తం నాలుగు పతకాలు సాధించి కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు.టేబుల్ టెన్నిస్ జి.ఓ. 50+ మిక్స్‌డ్ డబుల్స్‌లో రజత పతకం, జి.ఓ. 40+ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం, ఎన్‌జీఓ మిక్స్‌డ్ డబుల్స్‌లో మరో కాంస్య పతకం సాధించారు. బ్యాడ్మింటన్ జి.ఓ. 50+ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.విధి నిర్వహణలో బిజీగా ఉంటూనే క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో నాలుగు పతకాలు సాధించడం అభినందనీయమని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఆమె విజయం పోలీస్ శాఖకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com